www.vaarthavedhikasurya.com
PRGI.NO:- TGTEL/25/A0305
# వార్త వేదిక సూర్య
తెలుగు దినపత్రిక
VAARTHA VEDHIKA SURYA - TELUGU DAILY

| తెలంగాణ TELANGANA | సంపుటి : 1 VOLUME : 1 | సంచిక : 270 ISSUE : 270 | బుధవారం, ఫిబ్రవరి 25, 2026 WEDNESDAY, FEBRUARY 25, 2026 | ఎడిటర్ : పోలోజు శ్రీనివాస చారి EDITOR : POLOJU SRINIVASA CHARY | పేజీలు : 8 PAGES : 8 | వెల : 5-00 RS : 5-00 |
|---|---|---|---|---|---|---|

## సర్కార్ చేతికి మెట్రో..

- మెట్రోకు రూ.13 వేల కోట్ల రుణాలను ట్రాన్స్‌ఫర్



2 లో..



## ఆ నలుగురూ లొంగుబాటు

### డీజీపీ సమక్షంలో జనజీవన స్రవంతిలోకి దేవ్‌జీ సహా మావోయిస్టు అగ్రనేతలు

- మావోయిస్టు పార్టీ చరిత్రలోనే అతిపెద్ద కీలక పరిణామం
- ఇక పొలిట్ బ్యూరోలో మిగిలింది ఒకే ఒక్కరు
- ప్రజల హక్కుల కోసం రాజకీయాలు కొనసాగిస్తా: దేవ్‌జీ
- మావోయిజం ఎప్పటికీ ముగియదు: మల్లా రాజిరెడ్డి

2 లో..



### దేవాదుల సామర్థ్యాన్ని 100టీఎంసీలకు

## పెంచేలా కసరత్తు




- అధికారులను సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశం
- మదర్ డెయిరీని ఎన్‌డీడీబీకి అప్పగించాలి
- సీఎం రేవంత్‌కు డెయిరీ పాలక వర్గం విజ్ఞప్తి

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఫిబ్రవరి 24:

దేవాదుల ఎత్తిపోతల పథకం సామర్థ్యాన్ని భవిష్యత్తులో 100 టీఎంసీలకు పెంచడానికి వీలుగా అవసరమైన కసరత్తు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ బాధ్యతను సీఎం కార్యదర్శి మాణిక్కరాజ్ కన్నన్, నీటిపారుదలశాఖ ప్రత్యేక కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్‌లకు అప్పగించారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్టును 38.16 టీఎంసీల సామర్థ్యంతో, 5.57 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా నిర్మిస్తున్నారు. ఈ ప్రాజెక్టును గోదావరి ఎత్తిపోతల పథకం పేరుతో 1995–2000 మధ్యకాలంలో తెరమీదికి తీసుకొచ్చారు. ప్రతీ సంవత్సరం జూన్ నుంచి నవంబరు వరకు 50 టీఎంసీలు తరలించి, 2 లక్షల హెక్టార్లకు సాగునీటిని అందించాలని నిర్ణయించారు. 2005లో దీనికి పర్యావరణ, అటవీ అనుమతి లభించింది. 2007లో సీడబ్ల్యూసీకి చెందిన టెక్నికల్ అడ్వయిజరీ కమిటీ(టీఏసీ) అనుమతి లభించింది. ఇప్పటిదాకా ఈ ప్రాజెక్టు కోసం రూ.14,359 కోట్లను వెచ్చించారు. ఇటీవల సీఎం రేవంత్ ఈ ప్రాజెక్టును సందర్శించినప్పుడు.. ప్రాజెక్టు సామర్థ్యాన్ని 100 టీఎంసీలకు పెంచాలని విజ్ఞప్తులు రావడంతో సానుకూలంగా స్పందించి తాజా ఆదేశాలు జారీ చేశారు.

మిగతా 2లో..




### బాలికలకు ఫ్రీగా హెచ్‌పీవీ

## వ్యాక్సిన్

- దేశవ్యాప్తంగా అందించనున్న కేంద్రం
- గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు చర్యలు
- 14 ఏళ్ల వయసున్న బాలికలకు సింగిల్ డోస్ గార్డాసిల్

న్యూఢిల్లీ, (వార్త వేదిక సూర్య)-ఫిబ్రవరి 24:

మహిళల్లో పెరుగుతున్న గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు అడ్డుకట్ట వేసే దిశగా కేంద్రం కీలక నిర్ణయం తీసుకుంది. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించే హెచ్‌పీవీ (హ్యూమన్ పాపిలోమా వైరస్) వ్యాక్సిన్‌ను దేశవ్యాప్తంగా అందించేందుకు ఏర్పాట్లు చేస్తోంది. 14 ఏళ్ల వయసున్న



## మల్లారెడ్డికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

- జీడిమెట్ల భూ సర్వేపై దక్కని ఊరట
- హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యానికి నిరాకరణ

న్యూఢిల్లీ, (వార్త వేదిక సూర్య)-ఫిబ్రవరి 24:

మాజీ మంత్రి సీహెచ్ మల్లారెడ్డి, ఆయన కుమారుడు మహేందర్ రెడ్డి, అల్లుడు మర్రి రాజశేఖర్ రెడ్డిలకు సుప్రీంకోర్టు ఎదురుదెబ్బ తగిలింది. జీడిమెట్ల భూసర్వే వ్యవహారంలో సుప్రీంకోర్టును ఆశ్రయించగా వారికి ఊరట దక్కలేదు. హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యానికి సర్వోన్నత న్యాయస్థానం నిరాకరించింది. మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ మండలం జీడిమెట్లలోని

మిగతా 2లో..



### తళనాట శశికళ

## కొత్తపార్టీ

చెన్నై, (వార్త వేదిక సూర్య)-ఫిబ్రవరి 24:

తమిళనాడులో త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరుగనున్న వేళ.. రాష్ట్రంలో మరో కొత్త పార్టీ ప్రారంభమైంది. జయలలిత సన్నిహితురాలు, అన్నాడీఎంకే బహిష్కృత నాయకురాలు శశికళ మంగళవారం కొత్త పార్టీని ప్రారంభిస్తున్నట్లు ప్రకటించారు. జయలలిత 78వ జయంతిని పురస్కరించుకుని రామనాథపురంలో పార్టీ పతాకాన్ని ఆవిష్కరించిన ఆమె.. త్వరలోనే పార్టీ పేరును వెల్లడిస్తానని తెలిపారు. నలుపు,

మిగతా 2లో..


## కేరళ ఇక కేరళం..

2 లో..



## విజయీభవ

- నేటి నుంచి ఇంటర్ పరీక్షలు
- పకడ్బందీగా నిర్వహించాలి
- పరీక్షా కేంద్రాలకు 5 నిమిషాలు ఆలస్యమైనా అనుమతి
- ప్రతి పరీక్షా కేంద్రం వద్ద పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండాలి
- పరీక్షా సమయానుకూలంగా ఆర్టీసీ బస్సులు నడపాలి
- 10వ తరగతి, ఇంటర్ పరీక్షల నిర్వహణపై సీఎస్ వీడియో కాన్ఫరెన్స్



హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఫిబ్రవరి 24:

ఇంటర్ పరీక్షలను రాష్ట్రంలో కట్టుదిట్టంగా నిర్వహించాలని సి.ఎస్ రామకృష్ణారావు సంబంధిత అధికా రులను ఆదేశించారు. మంగళవారం సీఎస్ కె.రామకృష్ణరావు ఇంటర్, పదవ తరగతి పరీక్షల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించా రు. ఈ సందర్భంగా సీఎస్ కె.రామ కృష్ణ రావు మాట్లాడుతూ. నేటి నుంచి మార్చి 18 వరకు జరిగే ఇంటర్ పరీక్షల నిర్వహణకు కట్టు దిట్టమైన ఏర్పాట్లు చేయాలని అన్నారు. పరీక్షా కేంద్రాలకు 5 నిమిషాలు ఆలస్యమైనా విద్యార్థులను అనుమతించాలని స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రాలకు ఎవరికీ సెల్ ఫోన్ తీసుకుని రావడానికి అనుమతి లేదని, సీసీ కెమెరాల సమక్షంలోనే ప్రశ్నాపత్రాలు సీల్ ఓపెన్ చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు వచ్చే ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా చెక్ చేయాలని అన్నారు. పరీక్ష కేంద్రాలకు ప్రవేశద్వారం వద్ద ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా చెక్ చేసే వ్యవస్థ ఏర్పాటు చేయాలని అన్నారు. పరీక్షల నిర్వహణకు వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి పకడ్బందీగా పరీక్షలు నిర్వహించాలని,పరీక్ష కేంద్రాల వద్ద నిరంతర విద్యుత్ సరఫరా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు

మిగతా 2లో..



### రేవంత్ రెడ్డీ గుర్తుపెట్టుకో..

## నీకు మళ్లీ చిప్పకూడే

- ఆదిలాబాద్ జిల్లా జైలులో మాజీ ఎంపీ బాల్క సుమన్‌కు కేటీఆర్ పరామర్శ

ఆదిలాబాద్, (వార్త వేదిక సూర్య)-ఫిబ్రవరి 24:

ఆదిలాబాద్ జిల్లా జైలులో ఉన్న మాజీ ఎమ్మెల్యే, మాజీ ఎంపి బాల్క సుమన్‌ను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పరామర్శించారు. జైలులో పెడితే మా నాయకులు భయపడుతారని కాంగ్రెస్ నేతలు అనుకుంటున్నారని, ఇలాంటి ఉడుత ఊపులకు తాము భయపడబోమని కేటీఆర్ చెప్పారు. బాల్క సుమన్ ఇవాళ కొత్తగా జైలుకుపోలేదని, తెలంగాణ ఉద్యమ సమయంలో ఆరు నెలలు జైల్లో ఉన్నాడని తెలిపారు .రేవంత్ రెడ్డి ప్రభుత్వం మున్సిపాలిటీలో అక్రమంగా అధికారాన్ని హస్తగతం చేసుకుందని కేటీఆర్ ఆరోపించారు. ఆదేమని ప్రశ్నించిన

మిగతా 2లో..



## పాతబస్తీ హిందువులకు భాగ్యలక్ష్మీ రక్ష

- కేంద్ర మంత్రి బండి సంజయ్

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఫిబ్రవరి 24:

కరీంనగర్ పార్లమెంట్ పరిధిలోని కార్పొరేటర్లు, కౌన్సిలర్లతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియా సమావేశం నిర్వహించారు. కేంద్రం మంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ ఎన్ని కుట్రలు చేసినా కరీంనగర్ మహాశక్తి అమ్మవారి, భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులు ఉన్నాయి కాబట్టే తట్టుకుని కరీంనగర్ లో మేయర్ పీఠాన్ని కైవసం చేసుకున్నాం. మొక్కులు తీర్చుకునేందుకే భాగ్యలక్ష్మి ఆలయానికి వచ్చాం. బాగ్యలక్ష్మి

మిగతా 2లో..

## అంబర్‌పేట్‌లో విషాదం

- ఒకే కుటుంబంలో ముగ్గురు ఆత్మహత్య
- ఆర్థిక ఇబ్బందులే కారణమని సమాచారం

2 లో..

## భార్యను నరికి చంపిన భర్త

- రూ.1,000 కోసం ఇరువురి మధ్య గొడవ
- క్షణికావేశంతో నిండు ప్రాణాన్ని బలిగొన్న వైనం

2 లో..

సంపుటి : 1 సంచిక : 270 వార్త వేదిక సూర్య

హైదరాబాద్
బుధవారం, ఫిబ్రవరి 25, 2026

# ఆ నలుగురూ లొంగుబాటు

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఫిబ్రవరి 24:

మావోయిస్టు కీలక నేతలు మంగళవారం నాడు తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి ముందు లొంగిపోయారు. తెలంగాణ ఎస్ఐబీ ఆధ్వర్యంలో దేవ్జీ, రాజిరెడ్డి లొంగిపోయారు. దేవ్ జీకేంద్ర మావోయిస్టు పార్టీ సెక్రటరీగా ఉన్నాడు. డీజీపీ మట్లాడుతూ మావోయిస్ట్ ఉద్యమం ఇక ముగింపు దశకు చేరుకుంది. నేను మరొకసారి పిలుపునిస్తున్నాను వనాన్ని వీడి జనంలోకి రండి. మీ కుటుంబాలతో కలిసి మీ గ్రామాల్లో హాయిగా జీవించండి. పోరు వద్దు ఊరు ముద్దని అన్నారు. రెండేళ్లలో లొంగిపోయిన మావోయిస్టులకు పునరావాసం ఏర్పాటు చేయడంతో సగర్వంగా జీవిస్తున్నారు. మిగిలినవారు కూడా ఇదే బాటలో జనంలోకి రావాలని మరోసారి పిలుపునిస్తోంది పోలీసు శాఖ. వారికి ప్రభుత్వం తరుపున కావాల్సిన సాయం అందిస్తామని అయన అన్నారు.



Tipiri Thirupati @ Devuji @ Kumma dada, CCM & PBM



Malla Raji Reddy @ Sangram, CCM



Bade Chokka Rao @ Damodar @ Jagan, SCM & TSC Secretary



Nune Narsimha Reddy @ Ganganna @ Sannu dada, SCM

### ప్రజల హక్కుల కోసం పోరాడుతూనే ఉంటాం..: మల్లా రాజిరెడ్డి

మావోయిస్టు అగ్రనేతలు నలుగురు నేడు తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా మలా రాజిరెడ్డి మాట్లాడుతూ.. 'ప్రజలతో కలిసే పనిచేయాలని భావిస్తున్నాం. ప్రజల హక్కుల కోసం పోరాటం చేస్తాం. చట్ట ప్రకారమే పోరాటం చేయాలని లొంగిపోయాం. మావోయిజం అనేది ఎప్పటికీ అంతం కాదు. కొన్ని ప్రశ్నలను ప్రభుత్వంతో చర్చిస్తాం. త్వరలో అన్ని ప్రశ్నలకు జవాబు చెప్తాం' అని అన్నారు.

### నేను లొంగిపోవడానికి కారణం ఇదే..: దేవ్జీ (మావోయిస్టు అగ్రనేత)

మావోయిస్టు అగ్రనేతలు నలుగురు నేడు తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. అనారోగ్య కారణాల రీత్యా తాను లొంగిపోయానని తెలిపారు. మావోయిస్టు అగ్రనేతలు నలుగురు నేడు తెలంగాణ పోలీసుల ముందు లొంగిపోయిన సంగతి తెలిసిందే. దేవ్జీ అలియాస్ తిప్పిరి తిరుపతి(పొలిట్ బ్యూరో కమిటీ మెంబెర్).. మలా రాజిరెడ్డి అలియాస్ సంగ్రామ్(సెంట్రమ్ కమిటీ మెంబెర్).. బడే చొక్కారావు అలియాస్ దామోదర్ అలియాస్ జగన్(తెలంగాణ స్టేట్ సెక్రటరీ).. నూనె నరసింహారెడ్డి అలియాస్ గంగన్న సన్ను దాదా (స్టేట్ కమిటీ మెంబర్) పోలీసుల ముందు లొంగిపోయారు. ఈ సందర్భంగా దేవ్జీ మీడియాతో మాట్లాడుతూ.. అనారోగ్య కారణాల రీత్యా తాను లొంగిపోయానని తెలిపారు.

## దేవాదుల సామర్థ్యాన్ని 100టీఎంసీలకు పెంచేలా కసరత్తు

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో హన్మకొండ, వరంగల్, కరీంనగర్, జయశంకర్ భూపాలపల్లి, సిద్దిపేట, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, జనగామ, ములుగు జిల్లాల్లో 3దశల్లో ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయి.

### మదర్ డెయిరీని ఎన్డీడీబీకి అప్పగించాలి

అప్పుల్లో కూరుకుపోయిన నల్లగొండ-రంగారెడ్డి జిల్లాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహకార యూనియన్ (నార్ముల్-మదర్ డెయిరీ)ను వృద్ధిలోకి తీసుకువచ్చే బాధ్యతను జాతీయ పాడి పరిశ్రమాభివృద్ధి సంస్థ (ఎన్డీడీబీ)కు అప్పగించాలని సీఎం రేవంత్‌రెడ్డికి డెయిరీ పాలక వర్గం, స్థానిక ప్రజా ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఎన్డీడీబీ కొన్ని నిబంధనలను కఠినంగా అమలు చేసి డెయిరీని వృద్ధిలోకి తెస్తుందని వారు వివరించారు. మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో మదర్ డెయిరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి, పాలకవర్గ సభ్యులు, భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి తదితరులు కలిశారు. ప్రస్తుతం డెయిరీ తీవ్ర నష్టాలు, సమస్యలను ఎదుర్కొంటోందని, దీనిని ఎన్డీడీబీకి అప్పగించి సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని సీఎంను కోరారు. మదర్ డెయిరీని ఎన్డీడీబీకి అప్పగించేందుకు ఎన్వోసీ ఇప్పించాలని పాలకవర్గ సభ్యులు విన్నవించారు. వారి వినతిని సావధానంగా విన్న ముఖ్యమంత్రి.. డెయిరీ సమస్యల గురించి మంత్రి వాకిటి శ్రీహరి, శాఖ అధికారులతో భేటీ అయి సమగ్రంగా చర్చించాలని సూచించారు. బుధవారం సీఎం రేవంత్ మంత్రి వాకిటి శ్రీహరితో మాట్లాడే అవకాశం ఉందని మధుసూదన్ రెడ్డి తెలిపారు.

## బాలికలకు ఫ్రీగా హెచ్‌పీవీ వ్యాక్సిన్

(మొదటి పేజీ తరువాయి)

బాలికలకు ఉచితంగా హెచ్‌పీవీ టీకాను అందించే కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించనుందని ఆరోగ్యశాఖ వర్గాలు మంగళవారం తెలిపాయి. ఈ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా సింగిల్ షాట్ గార్డాసిల్ హెచ్‌పీవీ వ్యాక్సిన్‌ను అందిస్తారు. ఇది గర్భాశయ క్యాన్సర్‌కు కారణమయ్యే హెచ్‌పీవీ వైరస్‌లోని నాలుగు రకాల (6, 11, 16, 10) ఇన్ఫెక్షన్ల నుంచి రక్షణ కల్పిస్తుంది. ఒక వ్యాక్సిన్ డోసు తీసుకోవడం వల్ల బాలికలకు సంబంధిత వైరస్‌ల నుంచి దీర్ఘకాలిక రక్షణ ఉంటుంది. జాతీయ కార్యక్రమంలో భాగంగా కేంద్రం ఈ వ్యాక్సిన్‌ను ఉచితంగా అందించనుంది. 15 ఏళ్లలోపు వయసున్న బాలికల కోసం ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న గార్డాసిల్-4 అనే వ్యాక్సిన్‌ను రెండు డోసులు అందించాల్సి ఉంటుంది. ఒక్కో డోసు ధర రూ.3,927. అయితే 15 ఏళ్లు పైబడిన బాలికలు మాత్రం మూడు డోసులు తీసుకోవాలి. గార్డాసిల్-4 వ్యాక్సిన్‌ను ఇండియా అనే సంస్థ తయారు చేస్తోంది. ఈ టీకా 2006లో అందుబాటులోకి రాగా.. ప్రపంచవ్యాప్తంగా ఇప్పటి వరకు 50 కోట్ల డోసులను పంపిణీ చేశారు. దీంతో అనేక దేశాల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లు గణనీయంగా తగ్గినట్టు అంచనా. హెచ్‌పీవీ రకాల వల్ల వ్యాపించే గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌ను నివారించడంలో ఈ టీకా 93 నుంచి 100 శాతం ప్రభావంతో పనిచేసినట్టు ఆధారాలు ఉన్నాయి.

## రేవంత్ రెడ్డీ గుర్తుపెట్టుకో.. నీకు మళ్లీ చిప్పకూడే

(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ నాయకులపై కాంగ్రెస్ గూండాలతో దాడులు చేయించిందని విమర్శించారు. క్యాతన్‌పల్లిలో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికలో జరిగిన అక్రమాన్ని ప్రశ్నించినందుకు బాల్క సుమన్‌ను జైల్లో పెట్టారని మండిపడ్డారు. 'రేవంత్ రెడ్డీ గుర్తుపెట్టుకో.. నువ్వు మళ్లీ చిప్పకూడు తినే సమయం కచ్చితంగా వస్తుంది' అని ముఖ్యమంత్రిని హెచ్చరించారు.కేటీఆర్ ఇంకా మాట్లాడుతూ.. 'కాంగ్రెస్, బీజేపీ పార్టీలు మున్సిపల్ ఎన్నికల్లో రాష్ట్రవ్యాప్తంగా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డాయి, బీఆర్ఎస్ అభ్యర్థులను భయభ్రాంతులకు గురిచేశారు. కొన్ని మున్సిపాలిటీల్లో ప్రజాతీర్పును అపహాస్యం చేసేలా వ్యవహరించారు. మంచిర్యాల జిల్లా క్యాతన్‌పల్లి మున్సిపాలిటీలో బీఆర్ఎస్ పార్టీ సంపూర్ణ ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. 22 చోటకుగాను 14 స్థానాల్లో గెలుపుతో స్పష్టమైన మెజారిటీ వచ్చింది. కాంగ్రెస్ పార్టీ ఏడు స్థానాల్లో మాత్రమే గెలిచినా అధికార దాహంతో ప్రజాతీర్పును అపహాస్యం చేసింది. సీఎం, స్థానిక మంత్రి సూచనలకు అనుగుణంగా అధికారులు వారికి తొత్తులుగా మారి ప్రజాతీర్పును ఎగతాళి చేశారు' అని మండిపడ్డారు.'మరికొన్ని మున్సిపాలిటీలలోనూ ఇదే రీతిన వ్యవహరించారు. మహిళా కౌన్సిలర్లపై అసభ్యంగా ప్రవర్తించినా కనీసం మంత్రి స్పందించలేదు. దేశ చరిత్రలో ఇంత ఘోరమైన రాజకీయం లేదు. బాల్క సుమన్‌ను ఇక్కడ జైలులో ఉంచి వారి డ్యూటీకి ఆటంకం కలిగించారు. మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి పోలీసులను బూతులు తిట్టినా కేసు పెట్టలేదు. బీజేపీ ఎంపీ అరవింద్ పోలీసులను తిట్టినా కేసులు పెట్టలేదు. అధికార పార్టీ ప్రజాతీర్పును అపహాస్యం చేస్తుంటే.. ప్రశ్నించిన మా పార్టీ కార్యకర్తలపై కేసులు పెట్టారు. మూడు కోట్ల ఆఫర్ ఇచ్చినా మా కౌన్సిలర్లు లొంగలేదు. సీపీఐ కౌన్సిలర్లు సైతం నిబద్ధతతో ఉన్నారు. పొత్తుధర్మాన్ని పాటిస్తున్నారు' అని కేటీఆర్ చెప్పారు.'బాల్క సుమన్‌ను జైలులో పెట్టారు. ఆయనకు జైలు కొత్త కాదు. ఆరు నెలలు వివిధ సందర్భాల్లో జైలులో ఉన్నారు. జైలులో పెడితే భయపడతారనుకుంటే పొరపాటే. రేవంత్ రెడ్డికి మళ్ళీ చిప్పకూడు తినే సమయం వస్తుంది. పోలీసులను బూతులు తిడితే కేసులు పెట్టని డీజీపీ బీఆర్ఎస్ నేతలపై మాత్రం కేసులు పెట్టి జైలుకు పంపుతున్నారు. అధికారం ఎవరికీ శాశ్వతం కాదు. తిరిగి రాష్ట్రంలో గులాబి జెండా ఎగురుతుంది. ఏ కలుగులో దాక్కున్నా అరాచకాలు చేసిన వారిని వదిలే ప్రసక్తే లేదు. రాజ్యాంగాన్ని, చట్టాలను తుంగలో తొక్కుతున్న వారిని వదలం. క్యాతన్ పల్లి, ఇబ్రహీం పట్నం, ఖానాపూర్‌లో వెంటనే ఎన్నికలు పెట్టాలని డిమాండ్ చేస్తున్నాం' అన్నారు.'నిజాయితీగా ఎన్నిక జరిగే విధంగా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంది. అధికారుల ముసుగులో అధికార పార్టీకి వత్తాసు పలికే వారిని వదలం. క్యాతన్‌పల్లిలో మహిళా కౌన్సిలర్లపై అసభ్యంగా వ్యవహరించిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం. ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మిపై సైతం కేసు పెట్టారు. కాంగ్రెస్ పార్టీ ప్రజాస్వామ్యాన్ని అగౌరవపరుస్తున్నది. అధికార పార్టీకి ప్రజలు బుద్ధిచెప్పే రోజు వస్తుంది. బాల్క సుమన్‌ను దగ్గరలో ఉన్న జైలులో పెట్టకుండా దూరంగా ఉన్న జైలులో పెట్టి.. దోమలు ఎక్కువగా ఉన్న గదిలో ఉంచి వేధిస్తున్నారు. వీటన్నింటిని గుర్తుపెట్టుకుంటాం' అని వార్నింగ్ ఇచ్చారు.

## అంబర్‌పేట్‌లో విషాదం

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఫిబ్రవరి 24:

అంబర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు ఆత్మహత్యకు పాల్పడటం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. ఆర్థిక ఇబ్బందులే ఈ ఘోర నిర్ణయానికి కారణమని ప్రాథమికంగా తెలుస్తోంది. మృతులను రామరాజు (55), ఆయన భార్య మాధవి (50), మరియు కుమారుడు శశాంక్ (24) గా గుర్తించినట్లు పోలీసులు తెలిపారు.రామరాజు స్థానికంగా హోటల్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. గత కొంతకాలంగా వ్యాపారంలో నష్టాలు రావడంతో రామరాజు అప్పుల పాలయ్యారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం రామరాజు ఇంటి తలుపులు తెరుచుకోకపోవడంతో చుట్టుపక్కల వారు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు.. తలుపులు తెరిపించి చూడగా లోపల ముగ్గురూ విగతజీవులుగా కనిపించారు.రామరాజు, మాధవి ఉరివేసుకుని ప్రాణాలు తీసుకోగా, శశాంక్ తన మణికట్టు కోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అప్పుల భారం పెరిగిపోవడంతో తీవ్ర మనస్తాపానికి గురై కుటుంబమంతా ఈ విపరీత నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించిన పోలీసులు.. కేసు నమోదు చేసి ఆర్థిక లావాదేవీల కోణంలో విచారణ జరుపుతున్నారు.

## నిద్రిస్తున్న భార్యను గొడ్డలితో నరికి చంపిన భర్త

రంగారెడ్డి, (వార్త వేదిక సూర్య)-ఫిబ్రవరి 24:

రంగారెడ్డి జిల్లా మంచాల మండలం నోముల గ్రామంలో దారుణం జరిగింది. తాగిమైకంలో భర్త నిద్రిస్తున్న భార్యను గొడ్డలితో నరికి చంపాడు. గత శుక్రవారం శివరాత్రి జాతర సందర్భంగా ఇంటికి బంధువులు వచ్చిన సమయంలో బాబు మద్యం సేవించి అమృతతో గొడవ పడ్డాడు. శనివారం పనికి వెళ్లకుండా, పని చేసే చోట అప్పు తెచ్చిన 1000 రూపాయల విషయంలో దంపతుల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ గొడవతో మనస్తాపం చెందిన అమృత భర్తతో మాట్లాడటం మానేసింది. మంగళవారం ఉదయం కుమారులు ఇద్దరూ పనికి వెళ్లింది అదునుగా భావించి ఇంట్లో ఉన్న కోడలు చిన్న పాపను పడుకోబెట్టడానికి బెడ్రూంలోకి వెళ్ళింది చూసి బయట డోర్ లాక్ చేసి గొడ్డలితో కిందకు వచ్చి హాల్లో దివాన్ పై నిద్రిస్తున్న అమృత(50)పై గొడ్డలితో విచక్షణారహితంగా దాడి చేసాడు. మెడపై, దవడపై బలంగా నరకడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. హత్య చేసిన అనంతరం బాబు గొడ్డలిని అక్కడే వదిలేసి పరారయ్యాడు. బెడ్రూంలో ఉన్న కోడలు శబ్దం విని బయటకు రావడానికి ప్రయత్నించగా, బయట నుంచి గడియ పెట్టి ఉండటంతో భర్తకు,ఇరుగుపొరుగు వారికి సమాచారం అందించింది. ఇరుగుపొరుగు వారు వచ్చి తలుపులు తీసి చూడగా అమృత రక్తపు మడుగులో పడి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని క్లూస్ టీం సహాయంతో ఆధారాలు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియ ఆసుపత్రికి తరలించారు.

## పాతబస్తీ హిందువులకు భాగ్యలక్ష్మీ రక్ష

హైదరాబాద్, (వార్త వేదిక సూర్య)-ఫిబ్రవరి 24:

అమ్మవారి ఆలయం చాలా పవర్ ఫుల్..బీజేపీ అధికారంలోకి వచ్చిన వెంటనే పంజాబ్ స్వర్ణ దేవాలయం తరహాలో భాగ్యలక్ష్మి ఆలయాన్ని గోల్డెన్ టెంపుల్ గా మారుస్తామని అన్నారు. పాతబస్తీ హిందువులకు రక్ష భాగ్యలక్ష్మి అమ్మవారు. గతంలో ఎంతో మంది హిందువులు పాతబస్తీ నుండి వెళ్లారు. అమ్మవారి శక్తి తెలుసుకుని మళ్లీ పాతబస్తీకి విచ్చేశారు. భాగ్యలక్ష్మి అమ్మవారి ఆశీస్సులతోనే ప్రజా సంగ్రామ యాత్రను ప్రారంభించిన. కేసీఆర్ సర్కార్ దాడులను తట్టుకుని ప్రజా సంగ్రామ యాత్రను దిగ్విజయం చేశాం. ప్రజాసంగ్రామ యాత్ర ద్వారా 1640 కి.మీలు నడిచిన. పాదయాత్ర ప్రారంభించి 1640 రోజులు పూర్తయ్యింది. మజిస్ కంచుకోటను బద్దలు కొట్టి ఇదే చోట ప్రజా సంగ్రామ యాత్రను ప్రారంభించినా. హైదరాబాద్ లో హిందూ సమాజానికి ఏ ఆపద వచ్చినా అడ్డుకోవడానికి మేం సిద్ధం. కాంగ్రెస్, బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చినా మా బూట్లు నాకాల్సిందేనని మజిస్ నేతలు చెబుతున్నారంటే సిగ్గుండాలి. సికింద్రాబాద్ ముత్యా లమ్మ గుడి మొదలు సంతోష్ నగర్ భూలక్ష్మి, బంజారాహిల్స్ పెద్దమ్మ గుడి, శంషాబాద్ ఆలయాలపై దాడులు జరిగాయి. ఇంత పెద్ద ఎత్తున ఆలయాలపై దాడులు జరుగుతున్నా ఎందుకు స్పందించడం లేదని అన్నారు. గోహత్యలు, లవ్ జిహాదీల పేరుతో హిందూ అమ్మాయిలపై డ్రగ్స్ ఇస్తూ అత్యాచారాలు చేస్తున్నా స్పందించరా? హిందూ ధర్మాన్ని కాపాడాలనే సంకల్పంతో కసితో మేం పనిచేస్తున్నాం అన్నారు.

## సర్కార్ చేతికి మెట్రో..

హైదరాబాద్, (వార్త, వేదిక సూర్య):

తాజాగా జరిగిన తెలంగాణ మంత్రివర్గ సమావేశంలో హైదరాబాద్ మెట్రో స్వాధీనంపై కీలకే నిర్ణయం తీసుకున్నారు. ఎల్ అండ్ టీ కంపెనీ నుంచి హైదరాబాద్ మెట్రోను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించింది. ఇక ఈ స్వాధీన ప్రక్రియను పర్యవేక్షించేందుకు మంత్రి వర్గ ఉప సంఘాన్ని ఏర్పాటు చేసింది. రూ.2 వేల కోటను ఎల్ అండ్ టీకి చెల్లించడంతోపాటు.. మరో రూ.13 వేల కోటే రుణాలను ట్రాన్స్ఫర్ చేసుకునేందుకు ఇప్పటికే సూత్రప్రాయంగా అవగాహన చేసుకున్నాయి.ఇప్పటివరకు ఎల్ అండ్ టీ కంపెనీ నిర్వహిస్తున్న హైదరాబాద్ మెట్రోను పూర్తిగా స్వాధీనం చేసుకోవాలని తెలంగాణ కేబినెట్ నిర్ణయం తీసుకుంది. హైదరాబాద్ మెట్రో స్వాధీనంపై ఇప్పటికే తెలంగాణ సర్కార్ ప్రకటన విడుదల చేసింది.

## మల్లారెడ్డికి సుప్రీంకోర్టులో ఎదురుదెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

సర్వే నం 82/1/ఈఈలో భాగమైన 0.33 గుంటల విస్తీర్ణంలోని భూమి హద్దులు నిర్ణయించేలా రెవెన్యూ అధికారులను ఆదేశించాలని కోరుతూ శేరి శ్రీనివాస్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ వేశారు. తమ హక్కులను ఉల్లంఘించేలా కుత్బుల్లాపూర్ తహసీల్దార్ జారీ చేసిన లేఖను ఆయన కోర్టులో సవాల్ చేశారు. అదే సర్వే నంబర్‌లోని మిగిలిన భూమిలోకి వెళ్లే దారిని పూర్తిగా మూసివేశారని పేర్కొన్నారు. దీనిపై విచారణ చేపట్టిన సింగిల్ జడ్జి.. దరఖాస్తు అందిన తేదీ నుంచి 45 పనిదినాల్లో చట్టప్రకారం సర్వే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. దీనిపై మల్లారెడ్డి తదితరులు డివిజన్ బెంచ్ ఎదుట సవాల్ చేశారు. ద్విసభ్య ధర్మాసనం కూడా సింగిల్ జడ్జి ఉత్తర్వులను సమర్థించింది. హైకోర్టు తీర్పును వారు సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ఆ పిటిషన్‌పై మంగళవారం జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఎస్.వి. అంజరియాలతో కూడిన ధర్మాసనం విచారణ జరిపింది. సర్వే ప్రక్రియ ఇప్పటికే పూర్తయిన నేపథ్యంలో తాము జోక్యం చేసుకోలేమని తేల్చిచెప్పింది.

## తళనాట శశికళ కొత్తపార్టీ

(మొదటి పేజీ తరువాయి)

తెలుపు, ఎరుపు రంగులు గల పతాకంపై దివంగత సీఎంలు అన్నాదురై, ఎంజీఆర్, జయలలిత చిత్రాలున్నాయి. ఈ సందర్భంగా శశికళ మాట్లాడుతూ మాజీ సీఎం తీవ్ర ఆరోపణలు చేశారు. తనకు, అన్నాడీఎంకేకు ద్రోహం తలపెట్టారని విమర్శించారు. ''మేం తొందరపడి ఆయన్ను ముఖ్యమంత్రిగా ఎంచుకున్నాం. అప్పటికి ఆయన ఎలాంటి వ్యక్తో నాకు తెలియదు. ఆయన్ను నేను సీఎం కుర్చీలో కూర్చోపెడితే, నన్ను పార్టీ నుంచి తొలగిస్తూ తీర్మానం చేయించాడు'' అని శశికళ పరోక్షంగా నిప్పులు చెరిగారు. ''నేను జైల్లో ఉన్నప్పుడు నా భర్త చనిపోతే అధికారులు 15 రోజులు పెరోల్ మంజూరు చేశారు. అయితే నాకు 5 రోజుల కంటే ఎక్కువ పెరోల్ ఇవ్వకూడదని ఉత్తర్వులు తెప్పించారు. నేను ముఖ్యమంత్రి చేసిన వ్యక్తి నాకే వెన్నుపోటు పొడిచాడు'' అంటూ శశికళ భావోద్వేగానికి గురయ్యారు.పార్టీ జెండాను ఈ సందర్భంగా శశికళ ఆవిష్కరించారు. నలుపు, తెలుపు, ఎరుపు రంగులు కలిగి, అన్నాదురై, ఎంజీఆర్, జయలలిత చిత్తరువులతో ఈ జెండా రూపొందింది. పార్టీ పేరును త్వరలోనే ప్రకటిస్తామని శశికళ తెలిపారు. 2016లో జయలలిత మరణానంతరం జరిగిన సంఘటనలను శశికళ గుర్తుచేసుకుంటూ, అప్పుడు మంత్రులు, ఎమ్మెల్యేలు అంతా తనను ముఖ్యమంత్రి కావాలని కోరారని చెప్పారు. చిన్నమ్మా... మీరు తప్పనిసరిగా ముఖ్యమంత్రి కావాలి అని వాళ్లంతా నాతో అన్నారు అని తెలిపారు. అయితే ఆ సమయంలో తాను వ్యక్తిగత పనులు ఉండటంతో అందుకు నిరాకరించానని, ఓ పన్నీరు సెల్వం ముఖ్యమంత్రిగా కొనసాగారని తెలిపారు. ఆ తదుపరి క్రమంలో ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో శశికళను అన్నాడీఎంకే పార్టీ నుంచి బహిష్కరించారు. కాగా, తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఈ ఏడాది ప్రథమార్థంలో జరగాల్సి ఉన్నాయి.

## కేరళ ఇక కేరళం..

న్యూఢిల్లీ, (వార్త వేదిక సూర్య)-ఫిబ్రవరి 24:

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర కేబినెట్ సంచలన నిర్ణయం తీసుకుంది. కేరళ పేరును కేరళంగా మార్చడానికి ఆమోదం తెలిపింది. భాష ఆధారంగా రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి, కేరళకు కేరళం అని పేరు పెట్టాలనే డిమాండ్ ఉంది. ఈ డిమాండ్‌ను కేంద్ర మంత్రి మండలి ఆమోదించిందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు.ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వం లోని కేంద్ర కేబినెట్ సంచలన నిర్ణయం తీసుకుంది. కేరళ పేరును "కేరళం"గా మార్చడానికి ఆమోదం తెలిపింది. భాష ఆధారంగా రాష్ట్రం ఏర్పడినప్పటి నుండి, కేరళకు కేర ళం అని పేరు పెట్టాలనే డిమాండ్ ఉంది. ఈ డిమాండ్‌ను కేంద్ర మంత్రి మండలి ఆమోదించిందని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఈ సంవత్సరం జరగనున్న కేరళం అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఈ చర్య తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. మంగళవారం (ఫిబ్రవరి 24, 2026)న ప్రధానమంత్రి కార్యాలయం కొత్త భవనం 'సేవా తీర్థ'లో కేంద్ర మంత్రివర్గ తొలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలు కీలక నిర్ణయాలకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా రాష్ట్ర పేరును అధికారికంగా 'కేరళం'గా మార్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ కేరళ శాసనసభ జూన్ 24, 2024న ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించింది. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ మొదటి ప్రతిపాదనను సమీక్షించి, కొన్ని సాంకేతిక మార్పులను సూచించింది. దీంతో కేరళ శాసనసభ రెండవసారి ఈ తీర్మానాన్ని ఆమోదించింది. ఈ మేరకు ఇవాళ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. రాజ్యాంగంలోని ఎనిమిదవ షెడ్యూల్‌లో జాబితా చేసిన అన్ని భాషలలో దక్షిణాది రాష్ట్రం పేరును కేరళ నుండి "కేరళం"గా మార్చాలని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కేరళ అసెంబ్లీ ఆగస్టు 2023లో ఇదే విధమైన ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించి కేంద్ర ప్రభుత్వానికి పంపింది. అయితే హోమ్ మంత్రిత్వ శాఖ కొన్ని సాంకేతిక మార్పులను సూచించింది. ఈ సంవత్సరం ప్రారంభంలో, భారతీయ జనతా పార్టీ కేరళ రాష్ట్ర అధ్యక్షు డు రాజీవ్ చంద్రశేఖర్ కూడా ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి లేఖ రాస్తూ, రాష్ట్ర అధికారిక పేరును "కేరళ" నుండి "కేరళం" గా మార్చాలని డిమాండ్ చేశారు.

## విజయీభవ

(మొదటి పేజీ తరువాయి)

పరీక్ష హాల్స్ లో త్రాగు నీరు అందించాలని, అవసరమైన మౌళిక సదుపాయాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. పరీక్షల నేపథ్యంలో విద్యార్థుల సౌకర్యార్థం రవాణా కోసం పరీక్షకు సకాలంలో హాజరయ్యే విధంగా అనుకూలంగా ఆర్టీసీ బస్సులు పరీక్షా కేంద్రాల రూట్ లలో స్పెషల్ బస్సులు నడపాలని అన్నారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ఓ.ఆర్.ఎస్ ప్యాకెట్లు, కనీస మందులతో పారా మెడికల్ సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన వైద్య శాఖ అధికారులను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల్లో పారిశుద్ధ్య నిర్వహణ స్థానిక సంస్థలు పర్యవేక్షించాలని ఆయన సూచించారు.





## ఇంటర్, 10వ తరగతి వార్షిక పరీక్షలను
# పకడ్బందీగా నిర్వహించాలి

- జిల్లా కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి

(యాదాద్రి భువనగిరి బ్యూరో) ఫిబ్రవరి 24 వార్త వేదిక సూర్య

ఇంటర్, 10వ, తరగతి వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని, రాష్ట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రామకృష్ణరావు అన్నారు. మంగళవారం రాష్ట సచివాలయం నుండి ఇంటర్ 10వ. తరగతి పరిక్షల నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్ పి లు, విద్యాశాఖ అధికారులు, వైద్యశాఖ అధికారులు,ఆర్ టి సి అధికారులు, విద్యాశాఖ అధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమానికి కార్యదర్శులు,కమిషనర్లతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ... ఈ నెల 25 నుండి మార్చి 18 వరకు ఇంటర్ ప్రధమ, ద్వితీయ పరిక్షలు వుంటాయని, 10వ. తరగతి వార్షిక పరిక్షలు, మార్చి 14 నుండి ఏప్రిల్ 16 వరకు ఉంటాయని, ప్రతి పరిక్ష కేంద్రంలో త్రాగునీరు, పారిశుద్యం, వెలుతురు, సరిపడా పర్నిచర్ వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రం వద్ద మెడికల్ క్యాంపు, పోలీస్ బందోబస్తు, ప్రశ్న ,జవాబు పత్రాలను పోలీస్ బందోబస్తు మద్య పరిక్ష కేంద్రాలకు తరలించాలన్నారు.విద్యార్ధులు పరిక్ష సమయానికి చేరుకునేలా, ఆర్ టి సి అధికారులు బస్సులు నడపాలన్నారు. ఈ వీసీ లో జిల్లా కలెక్టర్ హనుమంత రావు, ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్,స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, అడిషనల్ ఎస్పి లక్ష్మీనారాయణలతో కలిసి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ వీసీ అనంతరం ఇంటర్మీడియట్, ఎస్.ఎస్.సి (రూజ) పబ్లిక్ పరీక్షల నిర్వహణకు సంబంధించిన సన్నద్ధతపై .. జిల్లా కలెక్టర్ హనుమంత రావు అన్ని లైన్ శాఖల అధికారులతో సమగ్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...పరీక్షలు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు జరిగేలా చూడాలన్నారు .ఈ సంవత్సరం జిల్లా లో ఇంటర్మీడియట్ లో మొత్తం 28 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని ప్రథమ, ద్వితీయ సంవత్సరాలకు గాను 12,813 మంది విద్యార్థులు ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరుకానున్నారన్నారు . పదవ తరగతి పరీక్షకు 50 పరీక్షా కేంద్రాలు, 8933 మంది విద్యార్థులు హాజరుకానున్నారు.ప్రతి పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.పరీక్షా కేంద్రాలలో తగిన ఫర్నిచర్, తాగునీరు, పారిశుద్ధ్యం, సరైన వెలుతురు, గాలి ప్రసరణ మరియు నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రశ్నాపత్రాలు, జవాబు పత్రాల భద్రత విషయంలో నిబంధనలు కచ్చితంగా పాటించాలని ఆదేశించారు. పోలీస్ శాఖ అధికారులకు పరీక్షా కేంద్రాల వద్ద తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని, సున్నితమైన కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా ఉంచాలని సూచించారు. ప్రశ్నా పత్రాలు, జవాబు పత్రాల రవాణాకు అవసరమైన పోలీస్ ఎస్కార్ట్ ఏర్పాటు చేయాలని తెలిపారు.

రవాణా శాఖ ద్వారా గ్రామీణ మరియు దూర ప్రాంతాల విద్యార్థులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా తగిన బస్సు సౌక ర్యాలు కల్పించాలని ఆదేశించారు. వైద్య శాఖ పరీక్షా కేంద్రాల వద్ద ప్రథమ చికిత్స సదుపాయాలు, అత్యవసర సేవలు సిద్ధంగా ఉంచాలని సూచించారు. మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖలు పరీక్షా కేంద్రాల పరిసరాల్లో పరిశు భ్రత, తాగునీటి సరఫరా నిరంతరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. విద్యుత్ శాఖ పరీక్షల సమయంలో అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా కొనసాగించేలా ప్రత్యేక బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. పారదర్శక నిర్వహణ కోసం ప్రతి పరీక్షా కేంద్రంలో సిట్టింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేయాలని, అదనంగా ఫ్లయింగ్ స్క్వాడ్లు, ప్రత్యేక తనిఖీ బృందాలు నిరంతరం పర్యవేక్షణ చేపడతాయని జిల్లా కలెక్టర్ తెలిపారు. పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజనల్ అధికారి కృష్ణారెడ్డి, ఇంటర్మీడియట్ అధికారి రమణి, జిల్లా విద్యాధికారి సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను బాధితులకు అందజేసిన నల్లగొండ అదనపు ఎస్పీ జి. రమేష్




నల్లగొండ బ్యూరో, ఫిబ్రవరి 24 (వార్తా వేదిక సూర్య )

నేటి ఆధునిక కాలంలో మొబైల్ ఫోన్ అనేది కేవలం సమాచార సాధనం మాత్రమే కాదని, అది ఒక వ్యక్తి వ్యక్తిగత సమాచారం,ఆర్థిక లావాదేవీలకు కీలకమైన వనరు అని అదనపు ఎస్పీ జి. రమేష్ పేర్కొన్నారు. నల్లగొండ వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ సందర్భాల్లో పోగొట్టుకున్న దొంగతనానికి గురైన సుమారు 60 మొబైల్ ఫోన్లను సాంకేతిక పరిజ్ఞానం (సి ఈ ఐ ఆర్ పోర్టల్, ఐఎంఈఐ ట్రాకింగ్) సహాయం తో పోలీసులు విజయవంతంగా రికవరీ చేశారు. వన్ టౌన్ సిబ్బంది కె సత్యనారాయణ,ఐటి కోర్ టీం సమన్వయంతో దేశంలోని వివిధ ప్రాంతాల నుండి ఈ ఫోన్లను ట్రేస్ చేసి స్వాధీనం చేసుకున్నారు. రికవరీ చేసిన ఫోన్లను మంగళవారం అదనపు ఎస్పీ జి. రమేష్ స్వయంగా పరిశీలించి, వాటి అసలు యజమానులకు అందజేశారు. తమ ఫోన్లను తిరిగి పొందిన బాధితులు పోలీసు యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ.. "మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వెంటనే కంగారు పడకుండా, వెంటనే సమీపంలోని పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలి లేదా ప్రభుత్వం ప్రవేశపెట్టిన సిఈఐఆర్ (సెంట్రల్ ఎక్యూప్మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్) పోర్టల్లో వివరాలను నమోదు చేయాలని అన్నారు. దీనివల్ల ఫోన్ దుర్వినియోగం కాకుండా బ్లాక్ చేయడంతో పాటు, దానిని త్వరగా కనిపెట్టే అవకాశం ఉంటుందని అన్నారు. అపరిచిత వ్యక్తుల నుండి సెకండ్ హ్యాండ్ ఫోన్లు కొనేటప్పుడు బిల్లులు, బాక్సులను తప్పనిసరిగా తనిఖీ చేయాలని తెలిపారు. ఫోన్లలో వ్యక్తిగత ఫోటోలు, బ్యాంకింగ్ వివరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి అన్నారు. ఈ కార్యక్రమంలో కె శివరాం రెడ్డి, వన్ టౌన్ సిఐ రాజ శేఖర్ రెడ్డి, ఎస్ఐలు గోపాల్ రావు, వెంకట నారాయణ ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## కాలనీ బోర్డులను ఏర్పాటు చేసిన 5వ వార్డు మెంబర్ బత్తుల మమత విజయ్



దేవరకొండ ఫిబ్రవరి 24(వార్త వేదిక సూర్య):

కొండమల్లేపల్లి పట్టణంలోని 5వ వార్డులో వార్డు మెంబర్ బత్తుల మమత విజయ్ నేమ్ బోర్డులను ఏర్పాటు చేశారు. హైదరాబాదు రోడ్డులోని వినాయక నగర్, విద్యానగర్ బోర్డులను తమ సొంత ఖర్చులతో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలనీవాసుల సౌలభ్యం, కొత్తవారికి ఇబ్బంది కలగకుండా పేరు చూడగానే కాలనీ నీ గుర్తుపట్టేలా బోర్డులు ఏర్పాటు చేశామన్నారు ఈ సందర్భంగా కాలనీవాసులు బత్తుల మమతా విజయలను అభినందించారు. దేవరకొండ శాసనసభ్యులు నేనావత్ బాలు నాయక్ స్థానిక్, సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి ల సహకారంతో వార్డులో నెలకొన్న సమస్యలను అంచలంచలుగా పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. ఎలాంటి సమస్య ఉన్న ఐదో వార్డు ప్రజలు తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



- 10,000 రూపాయిలు ఆర్థిక సాయం
- గ్రామ సర్పంచ్ ఏడుదొడ్ల విజేత ప్రభాకర్ రెడ్డి



నాంపల్లి ఫిబ్రవరి 24(వార్త వేదిక సూర్య

స్వాములవారి లింగోటం గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. గ్రామానికి చెందిన అనేపాక యాదయ్య మరణవార్త తెలుసుకున్న గ్రామ సర్పంచ్ ఏడుదొడ్ల విజిత ప్రభాకర్ రెడ్డి, మృతుని నివాసానికి చేరుకుని ఆయన భౌతికకాయానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించిన సర్పంచ్, వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ క్లిష్ట సమయంలో ఆ కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇస్తూ, తక్షణ సహాయం కింద 10,000 రూపాయల ఆర్థిక సాయాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు, నల్లపు వెంకటేష్, కిత హారేయ, గడ్డి వెంకటేష్,దుబ్బ సతీష్, బుషిపాక దశరథ, దుబ్బ యాదయ్య, బుషిపాక రాములు, దుబ్బ కృష్ణయ్య, కొమ్ము రామస్వామి, దుబ్బ జనార్ధన్,గ్రామ పెద్దలు యాదయ్య కుటుంబానికి ధైర్యం చెప్పారు.

## నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్లకు ఘన సన్మానం

నల్లగొండ బ్యూరో, ఫిబ్రవరి 24 (వార్తా వేదిక సూర్య)

నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ 5 వ డివిజన్ లోని బిటిఎస్ దుర్గా కాలనీలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ ఆధ్వర్యంలో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి దంపతులను, స్థానిక కార్పొరేటర్ పున్న జ్ఞానేశ్వరి గణేష్, 22 వ డివిజన్ కార్పొరేటర్ అమీనా ఫర్హానా సమద్ దంపతులను మంగళవారం అంబేద్కర్ భవన్ లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు.పార్టీలకు అతీతంగా డివిజన్లోని అన్ని కాలనీలలో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ నీరుడు వెంకట్ రాములు అధ్యక్షుడు జరిగిన ఈ కార్యక్రమంలో కో –చైర్మన్లు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



## పరిశ్రమలలో ప్రమాదాలు జరగకుండా యాజమాన్యాలు జాగ్రత్తలు తీసుకోవాలి

కలెక్టర్ హనుమంతరావు

(యాదాద్రి భువనగిరి బ్యూరో) ఫిబ్రవరి 24 వార్త వేదిక సూర్య

జిల్లాలోని పరిశ్రమలలో, అగ్ని ప్రమాదాలు, పేలుళ్ళు అవాంఛనీయ సంఘటన లు జరగకుండా కంపెనీల యాజమాన్యాలు తగిన జాగ్ర త్తలు తీసుకోవాలని లేనిచో చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా కలెక్టర్ హనుమంత రావు తెలిపారు. మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో జిల్లా కలెక్టర్ హనుమంతరావు, ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్, అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, అడిషనల్ ఎస్పీ లక్ష్మీనారాయణ తో కలసి పరిశ్రమలలో అగ్ని ప్రమాదాలు, పేలుళ్ల ను నివారించేందుకు తీసుకోవలిసిన చర్యల పై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లడుతూ జిల్లాలోని కర్మాగారాలు మరియు పరిశ్రమల్లో అగ్ని ప్రమాదాలు, పేలుళ్లను నివారించేందుకు తీసుకోవాల్సిన నివారణ చర్యలపై సమీక్షించారు. జిల్లాలోని రసాయన, బల్క్ డ్రగ్స్ మరియు ప్రమాదకర (ఖుఓఖుతీఎశీబం) కర్మాగారాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ఉండేందుకు సంబంధిత శాఖల అధికారులు తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. కార్మికుల ప్రాణాల రక్షణే ప్రధాన లక్ష్యంగా, పరిశ్రమలు కాలుష్య నియంత్రణ మండలి, అగ్నిమాపక శాఖలు పరస్పరసమన్వయంతో పనిచేసి సంఘటనలు జరగకుండా చూడాలన్నారు,భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలన్నారు.అగ్ని ప్రమాదాలు మరియు పేలుళ్ల నివారణ చర్యలు, భద్రతా ప్రమాణాల కఠిన అమలు, కార్మికుల ప్రాణ భద్రత అంశాలపై సమగ్రంగా చర్చించి, వాటిని



తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. జిల్లా ఎస్పీ అక్షాంక్ష్ యాదవ్ మాట్లాడుతూ, జిల్లాలో ఏదైనా ప్రమాదం సంభవించిన సందర్భంలో స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకొని, విషపూరిత వాయువులు లేదా పొగ వల్ల చుట్టుపక్కల నివాస ప్రాంత ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వెంటనే ప్రజలను సురక్షిత చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శ్రీ దేవి, డిఐసి రవీందర్, జిల్లా ఫైర్ అధికారి సందేశ్ కుమార్, వైద్య ఆరోగ్యశాఖ అధికారి మనోహర్, నల్గొండ, డ్రగ్ ఇన్స్పెక్టర్బాలకృష్ణ ,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఫోటోగ్రాఫర్ పై దాడి జరగటం దురదృష్టకరం

పట్టణ ప్రధాన కార్యదర్శి దాసపత్రి జనార్ధన్



నల్లగొండ బ్యూరో, ఫిబ్రవరి 24 (వార్తా వేదిక సూర్య)

తిరుమలగిరి మండలం అల్వాల్ ఎక్స్ రోడ్డు లోని ఓ ఫంక్షన్ హాల్ లో నూతన పట్టువసలంకరణ ఫంక్షన్లో, సోమవారం ఫోటోగ్రాఫర్ మధు పై దాడిని తీవ్రంగా ఖండిస్తూ, తెలంగాణ రాష్ట్ర ఫోటో అండ్ వీడియోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నల్లగొండ పట్టణ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం నల్లగొండ పట్టణం క్లాక్ టవర్ సెంటర్ లో నిరసన కార్యక్రమాన్ని చేపట్టి, ఫోటోగ్రాఫర్ మధుకు న్యాయం జరిపి, నిందితులను కఠినంగా శిక్షించాలని ఎస్పీకి పిటిషన్ అందజేశారు. ఈ సందర్భంగా పట్టణ ప్రధాన కార్యదర్శి దాస పత్రి జనార్దన్ మాట్లాడుతూ.. నిన్న ఫోటోగ్రాఫర్ పై దాడి జరగటం దురదృష్టకరమని, ఒక ఫోటోగ్రాఫర్ తన కుటుంబం కోసం కస్టమర్ సాటి స్ఫాక్షన్ కోసం, రాత్రి పగలు అని తేడా లేకుండా, తనతో ఫోటోలు తీయించుకున్న వారికి, మధురానుభూతులను చాలా అందంగా చూపడానికి శ్రమిస్తూ ఉంటాడు. అలాంటి ఫోటోగ్రాఫర్ పై ఇద్దరు వ్యక్తులు మద్యం మత్తులో అతని పైన భౌతిక దాడి చేసి, అతని ఫోటో కెమెరాను పగలగొట్టడం హేయమైన చర్య అని, సదరు వ్యక్తుల పై తగు చర్యలు తీసుకొని,ఫోటోగ్రాఫర్ కు మరో కొత్త కెమెరాని అందించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్ర ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గంధం రూపేంద్ర కుమార్ మాట్లాడుతూ.. ఫోటోగ్రాఫర్ మధు పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, ఫోటోగ్రాఫర్ మధుకు తెలంగాణ రాష్ట్ర అసోసియేషన్ వెన్నుదన్నుగా ఉంటుందని, నిందితులను కఠినంగా శిక్షించాలని తెలియజేశారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి సామల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. రాష్ట్ర అసోసియేషన్ ఈ విషయాన్ని తీవ్రంగా పరగనిస్తూ, ఫోటోగ్రాఫర్ మధుకు న్యాయం జరిగేంత వరకు అండగా ఉంటామని తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నల్గొండ పట్టణ అసోసియేషన్ కోశాధికారి పెరిక నాగరాజు, గౌరవ సలహాదారుడు సామన బోయిన రాము, కార్యనిర్వాహక కార్యదర్శి కలగోని ధనుంజయ గౌడ్, కార్యవర్గ సభ్యులు ముచ్చర్ల విజయ్ కుమార్ మేడి వినోద్ కుమార్ కలగోని అనిల్ కుమార్ పట్టణ సీనియర్ ఫోటోగ్రాఫర్ సంగు రాంప్రసాద్ మరియు బోయినపల్లి విద్యాసాగర్ మరియు పట్టణ ఫోటోగ్రాఫర్స్ పాల్గొని విజయవంతం చేశారు.

## ఇంటర్మీడియట్ విద్యార్థులకు శుభాశీస్సులు..

మోత్కూరు, ఫిబ్రవరి 24 (వార్తా వేదిక సూర్య)

నేటి నుంచి ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో పరీక్షలు వ్రాసే మోత్కూరు మండల ఇంటర్మీడియట్ విద్యార్థిని, విద్యార్థులకు మోత్కూరు మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న ఆల్ ది బెస్ట్ చెప్పారు. మంగళవారం నాడు స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ ఇంటర్మీడియట్ పరీక్షలు రాసే విద్యార్థినీ విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో వ్రాయాలని కష్టపడి చదివిన దాన్ని ఇష్టంతో వ్రాసి మంచి ఉత్తీర్ణత సాధించాలని కోరారు.



## గుడిపల్లి మండల కేంద్రంలో శ్రీ శ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి ఉత్సవాలు ఘనంగా






దేవరకొండ ఫిబ్రవరి 24(వార్త వేదిక సూర్య):

మంగళవారం రోజు నల్గొండ జిల్లా నూతనంగా ఏర్పడిన గుడిపల్లి మండల కేంద్రంలో మొట్టమొదటిసారిగా గిరిజనుల ఆరాధ్య దైవం శ్రీశ్రీశ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించినారు. గుడిపల్లి మండలంలోని గిరిజన గ్రామాలు లోని ప్రస్తుత సర్పంచులు మాజీ సర్పంచులు మాజీ ఎంపీటీసీలు గిరిజనుల సంగాల నాయకుల ఆధ్వర్యంలో గుడిపల్లి మండల కేంద్రంలో బోగ్ బండారి కార్యక్రమం నిర్వహించి గుడిపల్లి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించి ఆటపాటలతో సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఇట్టి కార్యక్రమాన్ని ముందు ఉండి నడిపించిన నాయకులు యువకులు గుడిపల్లి మండల కాంగ్రెస్ పార్టీ యువజన అధ్యక్షులు బాలకృష్ణ చవాన్ నాయక్. పాల్తి రవి నాయక్. రమేష్ నాయక్. మొదలగు నాయకులు కలిసి గ్రామాలలోని గిరిజనుల పెద్దలను మర్యాదపూర్వకంగా కలిసి కార్యక్రమాన్ని నిర్వహించినారు. ఈ కార్యక్రమానికి మాదాపురం సర్పంచ్ రామావత్ శ్రీను నాయక్ . కేశంనేని పల్లి సర్పంచ్ శారద తానేష్ నాయక్. ఫీల్డ్ అసిస్టెంట్ మూడవత్ సక్రు నాయక్. శంకర్ నాయక్ శ్రీను నాయక్ మధు నాయక్ రవి నాయక్ బిక్కు మాదాపురం మాజీ సర్పంచ్ పద్మ జగన్ నాయక్. కిషన్ నాయక్ మాజీ సర్పంచ్ విజయలక్ష్మి మూనా నాయక్. శారద నాయక్ మొదలగు మహిళలు గిరిజన సంఘాల వివిధ హోదాలలో ఉన్న నాయకులు యువకులు పాల్గొన్నారు.



# పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2026 పోటీలలో మెడల్స్ సాధించిన సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ



**నల్లగొండ బ్యూరో, ఫిబ్రవరి 24 (వార్తా వేదిక సూర్య)**

4 వ తెలంగాణ పోలీస్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ – 2026 పోటీలు ఫిబ్రవరి 16 నుండి 21 వరకు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియం, సైబరాబాద్ పోలీస్ పరేడ్ గ్రౌండ్స్ లో ఘనంగా నిర్వహించబడ్డాయి. ఈ క్రీడా పోటీలలో నల్లగొండ జిల్లా పోలీస్ శాఖ కు చెందిన సిబ్బంది విశేష ప్రతిభ కనబరిచి పలు విభాగాల్లో మెడల్స్ సాధించి జిల్లా పోలీస్ శాఖకు గౌరవం తీసుకువచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గౌరవనీయులు నల్లగొండ జిల్లా ఎస్పీ మెడల్స్ సాధించిన సిబ్బందిని అభినందిస్తూ, వారికి మెడల్స్ అందజేశారు. విధులతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చూపుతూ శాఖకు మంచి పేరు తీసుకువచ్చినందుకు సిబ్బందిని ప్రశంసించారు. భవిష్యత్తులో జాతీయ స్థాయి పోటీల్లో కూడా మరింత ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. యాదాద్రి జోన్–ఎ పరిధిలోని వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది ఈ క్రీడా పోటీలలో పాల్గొని పలు మెడల్స్ సాధించడం విశేషం. ఈ కార్యక్రమంలో ఏ.ఆర్. డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు రాము, ఆది రెడ్డి, నాగరాజు, ఆర్.ఐలు శ్రీనివాస్, సంతోష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్న విద్యార్థిని విద్యార్థులకు శుభాకాంక్షలు

**ఎంపిపిఎస్ ఆర్కెపురం పాఠశాల ఎస్జీటీ(సయ్యద్ రూహి)**



**సికింద్రాబాద్, ఫిబ్రవరి 24(వార్త వేదిక సూర్య)**

బుధవారం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్న విద్యార్థిని విద్యార్థులకు తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టియుటిఎఫ్) రాష్ట్ర మహిళ సంయుక్త కార్యదర్శి ఎంపిపిఎస్ ఆర్కేపురం ఎస్జీటి సయ్యద్ రూహి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రియమైన విద్యార్థులారా మీ కష్టానికి మీ కలలకు మీ ఆశయానికి పరీక్షలు ఒక మెట్టు దిగువ మాత్రమే మీరు మీ లక్ష్యాన్ని చేరుకోవాలంటే ధైర్యంగా ముందుకు సాగాలి, ఆత్మవిశ్వాసంతో ముందుకు అడుగేయాలి. ఈ బోర్డు పరీక్షలు మీ భవిష్యత్తు బలమైన బాట వేయాలని ఆకాంక్షిస్తున్నాను.

# నాకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన ప్రతి ఒక్కరికి హృదయపూర్వక ధన్యవాదాలు

**రామినేని నాగరాజు(రెయిన్బో ఫ్లెక్స్ కలర్ ప్రింటింగ్ మేనేజింగ్ డైరెక్టర్)**



**సికింద్రాబాద్, ఫిబ్రవరి 24(వార్త వేదిక సూర్య)**

నేడు నా జన్మదిన వేడుకలు సందర్భంగా నాకు కాల్స్, మెసేజెస్, వాట్స్ అప్ మెసేజెస్ మరియు సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలియజేసిన నా తోటి మిత్రులకు, శ్రేయోభిలాషులకు, కుల బంధువులకు ప్రతి ఒక్కరికి నా యొక్క హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తున్నాను. ఈ సందర్భంగా ఆయనా మాట్లాడుతూ..ఎప్పటికి నా పై ప్రేమ ఇలాగే కొనసాగాలని కోరుకుంటున్నాను.

# చిన్నారిని హత్య చేసిన పెత్తందారులను కఠినంగా శిక్షించాలి



**చండూరు ఫిబ్రవరి 24 వార్త వేదిక సూర్య**

నాగర్ కర్నూలు జిల్లా కోమ్మెర గ్రామంలో గుడిలోకి ప్రవేశిస్తున్న రజక సామాజిక వర్గానికి చెందిన కీర్తన కుటుంబం పై దాడి చేసి, రెండు నెలల పాపను హత్య చేసిన గ్రామ పెత్తందారులపై చట్టపరంగా చర్యలు తీసుకొని కఠినంగా శిక్షించాలని సిపిఎం చండూరు మండల కార్యదర్శి జెర్రిపోతుల ధనంజయ ఒక ప్రకటనలో తెలిపారు. కులం పేరుతో రాష్ట్రంలో అనేకచోట్ల ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్న పాలకులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సరి కాదన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృత్తం కాకుండా, కుల దురహంకార హత్యలు జరగకుండా కఠిన చట్టాలను తెచ్చి అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ యంత్రాంగం చేతగానితనంతో ఇలాంటి హత్యలు జరుగుతున్నాయని, ప్రజల్లో సామాజిక చైతన్యాన్ని పెంపొందించాలని, కుల తత్వాన్ని దూరం చేయాలని, రెండు నెలల పాపను హత్య చేసిన గ్రామ పెత్తందారులపై కేసులు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని, కీర్తన కుటుంబానికి న్యాయం చేయాలని, లేనిపక్షంలో పెద్ద ఎత్తున పోరాటాలు నిర్వహిస్తామని వారు తెలిపారు.

# భూతగాదాలలో వదినపై మరిది దాడి



**మోత్కూరు, ఫిబ్రవరి 24 (వార్తా వేదిక సూర్య)**

భూ పంచాయతీ విషయంలో వదిన పై మరిది దాడి చేసి గొంతు కోసిన ఘటన మంగళవారం పాలడుగు గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం పాలడుగు గ్రామానికి చెందిన బొంత లక్ష్మి భర్త నర్సింహా సుమారు ఐదు నెలల క్రితం అనారోగ్యంతో మరణించగా,ఆమె వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తుందని తెలిపారు. 3 ఎకరాలు అక్రమంగా పట్టా చేసుకుందని ఆమె మరిది అశోక్ కు ఆమెకు కొద్దిరోజులుగా తగాదా నడుస్తున్నట్లు తెలిపారు. లక్ష్మీ భర్త నర్సింహా ఉన్నప్పుడు కూడా భూతగాథ విషయాలలో అన్నదమ్ముల కుటుంబాలు దాడులు చేసుకున్నట్లు, కేసు కూడా నడుస్తున్నట్లు చెప్పారు. ఈ క్రమంలోనే లక్ష్మి వ్యవసాయ బావి దగ్గరికి వెళ్తున్న క్రమంలో దారి కాసి అశోక్ చెల్లె కొడుకులతో కలిసి గొంతు కోసి పరారైనట్లు తెలిపారు. ఆమెకు రక్తస్రావం అవుతుండడంతో ప్రాథమిక చికిత్స నిర్వహించి 108 అంబులెన్స్ లో భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు ఈ ఘటనపై బాధితురాలు సోదరి.చంద్రమ్మ ఇచ్చిన మేరకు మోత్కూరు సి.ఐ సి వెంకటేశ్వర్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.





# అంతర్జాతీయ కిక్ బాక్సింగ్‌లో సత్తా చాటిన హారిక

- ఘనంగా సన్మానించిన తోకల శ్రీనివాస్ రెడ్డి
- కిక్ బాక్సింగ్‌లో మైలార్‌దేవ్‌పల్లి యువతి పూజారి హారిక ప్రభంజనం ఢిల్లీలో గోల్డ్ మెడల్ కైవసం

**మైలర్ దేవ్ పల్లి, ఫిబ్రవరి 24 (వార్త వేదిక సూర్య) :**

రాజేంద్రనగర్ నియోజకవర్గం, మైలార్‌దేవ్‌పల్లి పరిధిలోని బృందావన్ కాలనీకి చెందిన పూజారి హారిక కిక్ బాక్సింగ్‌లో అద్భుత ప్రతిభ కనబరిచి అంతర్జాతీయ మరియు రాష్ట్ర స్థాయి పోటీల్లో పతకాల పంట పండించారు. కాటేదాన్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లోని 'దేవ్ కిక్ బాక్సింగ్ అకాడమీ' లో కోచ్ నర్సింగ్ రావు గారి వద్ద శిక్షణ పొందుతున్న హారిక, వరుస విజయాలతో నియోజకవర్గానికి గర్వకారణంగా నిలిచారు. 5వ ఇండియన్ ఓపెన్ ఇంటర్నేషనల్ కిక్ బాక్సింగ్ ఛాంపియన్షిప్ 2026ఢిల్లీలోని కేడీ జాదవ్ ఇండోర్ స్టేడియంలో (ఫిబ్రవరి 4 నుండి 8 వరకు) జరిగిన ఈ పోటీలలో –42వేల విభాగంలో తలపడి ఒక గోల్డ్ మెడల్ మరియు రెండు బ్రాంజ్ మెడల్స్ సాధించారు. 2వ ఎడిషన్ చీఫ్ మినిస్టర్స్ కప్ 2025 గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో (ఫిబ్రవరి 20, 21 తేదీల్లో) జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో –42వేల ఉమెన్స్ విభాగంలో గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నారు. హారిక సాధించిన ఈ ఘనతను అభినందిస్తూ, రాజేంద్రనగర్ నియోజ కవర్గ ఇంచార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి ఆమెను ప్రత్యేకంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హారిక భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. క్రీడాకారిణికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అలాగే హారికను తీర్చిదిద్దిన కోచ్ నర్సింగ్ రావు ని కూడా ఆయన ఘనంగా సన్మానించారు. తెలంగాణ స్టేట్ కిక్ బాక్సింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ మైపాల్ సార్, రంగారెడ్డి జిల్లా సెక్రటరీ మరియు కోచ్ నర్సింగ్ రావు ప్రోత్సాహంతోనే ఈ మెడల్స్ సాధ్యమయ్యాయని హారిక కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రమేష్ రెడ్డి, నరసింహ, మధుసూదన్ రెడ్డి, సింహాద్రి, అశోక్ పాల్గొన్నారు.

# ప్రతి ఒక్కరూ గాయత్రీ మంత్రాన్ని జపించాలి

**గాయత్రీ పరివార్ ఆధ్వర్యంలో కర్నాటి శ్రీనివాస్ స్వప్న దంపతులకు వివాహ వార్షికోత్సవ సంస్కారం**

**దేవరకొండ ఫిబ్రవరి 24(వార్త వేదిక సూర్య):**

ప్రతిరోజు గాయత్రి మంత్రాన్ని జపిస్తే అంతా శుభమే జరుగుతుందని కొండమల్లేపల్లి గాయత్రీ పరివార్ నిర్వాహకులు అన్నారు. మంగళవారం ఏకకుండి గాయత్రీ యజ్ఞాన్ని ఘనంగా నిర్వహించారు. కొండమల్లేపల్లి పట్టణానికి చెందిన వ్యాపారవేత్త కర్నాటి శ్రీనివాస్ స్వప్న దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా హిందూ సంప్రదాయం ప్రకారం వివాహ సంస్కారాన్ని ఘనంగా నిర్వహించారు. పూలు అక్షింతలతో ఆశీర్వదించారు. భార్యా భర్తలో సగభాగం అని అన్యోన్యంగా కలిసిమెలిసి ఉండాలన్నారు. ఈర్ష, ద్వేషం,అసూయ వదిలి ప్రేమ అనురాగాలను అలవర్చుకోవాలన్నారు. ప్రతి ఒక్కరిలో దైవాన్ని చూడాలని అన్నారు. ప్రతి ఒక్కరూ తన సంపాదనలో కొంత దానధర్మాలు చేయాలన్నారు. డబ్బులు దానం చేయలేని వారు సమయ దానం చేసిన ఫలితం దక్కుతుందన్నారు. దైవ మార్గంలో ప్రతి ఒక్కరు ప్రయాణించాలని అన్నారు. ప్రతిరోజు గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో ఎస్ వి కాంప్లెక్స్ లోని ప్రజ్ఞా పీఠ్ వద్ద గాయత్రీ యజ్ఞం నిర్వహిస్తామన్నారు. ఎవరైనా జన్మదిన సంస్కారం, వివాహ సంస్కారం హిందూ సంప్రదాయ ప్రకారం చేసుకోవాలనుకుంటే మాకు ముందుగా సమాచారం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమాన్ని ఉచితంగా నిర్వహిస్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వింజమూరు చంద్రమౌళి, దాచేపల్లి వెంకటేశ్వర్లు, మారం వెంకటేశ్వర్లు, ఏరుకొండ రాము, వెంకటేష్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.





# వీధి వ్యాపారులపై మున్సిపల్ అధికారుల దౌర్జన్యం

**చట్ట విరుద్ధ చర్యలను ఖండిస్తున్న బీఆర్ఎస్ నాయకులు**

**మైలర్ దేవ్ పల్లి, ఫిబ్రవరి 24 (వార్త వేదిక సూర్య) :**

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 2014 మరియు 2022లో వీధి వ్యాపారుల జీవనోపాధి రక్షణ కోసం చట్టాలు తెచ్చినప్పటికీ, క్షేత్రస్థాయిలో మున్సిపల్ అధికారులు వాటిని తుంగలో తొక్కుతున్నారని బిఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు. స్థానిక మాజీ ప్రజాప్రతినిధుల అండదండలతో అధికారులు వీధి వ్యాపారులను బెదిరిస్తూ, అక్రమంగా మామూళ్లు వసూలు చేస్తున్నారని, డబ్బులు ఇవ్వని వారి వస్తువులను బలవంతంగా తీసుకెళ్తున్నారని వారు ఆరోపించారు. నిన్నటి రోజున ఒక దివ్యాంగునికి చెందిన గుడిసెను, డబ్బాను ధ్వంసం చేయడం అధికారుల దౌర్జన్యానికి పరాకాష్ట అని ధ్వజమెత్తారు. బాధితులను కలిసి వారికి చట్టంపై అవగాహన కల్పించి, బిఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. గత కౌన్సిల్ హయాంలో ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణం కోసం మణికొండ జాగీర్ సర్వే నంబర్ 65లో తీర్మానం చేసినప్పటికీ, అధికారులు మరియు అప్పటి పాలకవర్గం ఆ పనులను చేపట్ట డంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శిం చారు. గణేష్ చౌక్ సమీపంలో టిఫిన్ సెంటర్ నడుపుకునే మహిళకు చెందిన కుర్చీలు, టేబుల్స్ బలవంతంగా తీసుకెళ్లి, తిరిగి ఇవ్వడానికి రూ. 5000 డిమాండ్ చేయడం అధికారుల వసూళ్ల పర్వానికి నిదర్శనమని వారు ఆరోపించారు. వీధి వ్యాపారుల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తూ, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న మున్సిపల్ సిబ్బందిపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో భారత రాష్ట్ర సమితి స్థానిక అధ్యక్షుడు సీతారాం ధూళిపాళతో పాటు కుంబగళ్ళ ధనరాజ్, గుట్టమీది నరేందర్, ఉపేంద్రనాథ్ రెడ్డి, అందె లక్ష్మణ్ రావు, యాలల కిరణ్, మహమ్మద్ ఆరిఫ్, సుమనళిని, జై రామ్, భాను చందర్, బొడ్డు శ్రీధర్, బాబు రావు, ప్రవీణ్, రేఖ, దేవి ప్రియ, నరేశ్, మోహసిన్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యే ఎంపీల ఆశీర్వాదం తీసుకున్న శ్రీకాంత్

**మోత్కూరు, ఫిబ్రవరి 24 (వార్తా వేదిక సూర్య) :**

మోత్కూరు మున్సిపాలిటీ 9 వ వార్డు కౌన్సిలర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు బీసు శ్రీకాంత్ గౌడ్ జన్మదిన వేడుకలు మంగళవారం హైదరాబాద్ లో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ సమక్షంలో వారి నివాస గృహాలల్లో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ శ్రీకాంత్ గౌడ్ ను ఎంపీ,ఎమ్మెల్యే లు శాలువాలతో సన్మానించి,స్వీట్లు తినిపించారు. అనంతరం ఎంపీ ,ఎమ్మెల్యేలచే ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భం గా ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పర్రెపాటి యుగంధర్, చేడే మహేందర్ కంచన పల్లి సర్పంచ్ చేడే అంబేద్కర్ తదితరులు పాల్గొన్నారు.







# కారు డ్రైవర్ నిర్లక్ష్యంతో యువకుడు మృతి



**దేవరకొండ ఫిబ్రవరి 24(వార్త వేదిక సూర్య):**

రోడ్డు పక్కన దిమ్మెలపై కూర్చున్న వ్యక్తిని ఎర్టిగా కారు బలంగా ఢీ కొట్టడంతో యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం కొండమల్లేపల్లి మండల పరిధిలోని గుమ్మడవల్లి గ్రామానికి చెందిన యువకుడు షేక్ చాంద్ పాషా తండ్రి వలీముహమ్మద్ (30) రంజాన్ ఉపవాసాల నేపథ్యంలో మంగళవారం తెల్లవారుజామున నాలుగు గంటలకే లేచి కాలకృత్యాలు తీర్చుకున్న అనంతరం గుమ్మడవల్లి గ్రామంలోని బస్టాండ్ కు ఎదురుగా ఉన్న దిమ్మెలపై కూర్చొని పళ్ళు తోముకుంటుండగా కొండమల్లేపల్లి నుండి నల్గొండకు వెళుతున్న ఎర్టిగా కారు డ్రైవర్ అతివేగం నిర్లక్ష్యంతో దిమ్మెలపై కూర్చున్న షేక్ చాంద్ పాషాను బలంగా ఢీకొట్టడంతో ఎగిరి రోడ్డుపై పడ్డాడు. దీంతో ఆ యువకుడి తలకు, కడుపుకి కాళ్లకు బలంగా గాయాలైయి రక్తస్రావం జరిగింది. చుట్టుపక్కల వాళ్ళు గమనించి 108 కి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. చికిత్స నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన యువకుడి పరిస్థితి విషమించడంతో మెరుగైన చికిత్స కోసం నల్గొండ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. తలకు, కాళ్లకు కడుపులో బలంగా గాయాలై చికిత్స పొందుతూ షేక్ చాంద్ పాషా మృతి చెందాడు. మృతుడికి భార్య నాలుగేళ్ళ కుమార్తె ఉంది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ అజ్మీరా రమేష్ తెలిపారు.





# మధు పార్క్ రిడ్జ్ అపార్ట్మెంట్ వాసులకు ప్రభుత్వం పూర్తి భరోసా

### ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్

**మైలర్ దేవ్ పల్లి, ఫిబ్రవరి 24 (వార్త వేదిక సూర్య) :** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని మధు పార్క్ రిడ్జ్ అపార్ట్మెంట్ నివాసితుల ప్రయోజనాలను కాపాడటమే ప్రభుత్వ ప్రథమ ప్రాధాన్యత అని స్థానిక ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ స్పష్టం చేశారు. మంగళవారం అపార్ట్మెంట్ వాసులతో జరిగిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. బఫర్ జోన్ మరియు నిర్మాణ అనుమతుల విషయంలో తలెత్తిన వివాదాలపై స్పందిస్తూ, బాధితులెవరూ ఆందోళన చెందవద్దని అభయమిచ్చారు. బాధితులకు రెండు ప్రత్యామ్నాయాలు బఫర్ జోన్ పరిధిలో ఉండి ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఫ్లాట్ల యజమానులకు ప్రభుత్వం తరపున రెండు ఆప్షన్లను పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. అదే విస్తీర్ణంలో, సురక్షితమైన వేరే గృహ సముదాయాలలో తక్షణ నివాసానికి సిద్ధంగా ఉన్న గృహాలను కేటాయించడం. లేక ప్రస్తుతం మార్కెట్లో ఉన్న ధర ప్రకారం తగిన నష్టపరిహారం చెల్లించడం. జరుగుతుందన్నారు. నిర్మాణదారుల తప్పిదాలకు సామాన్యులు నష్ట పోకూడదు. నిబంధనలను అతిక్రమించి అక్రమంగా నిర్మాణాలు చేసిన వారి వల్ల సామాన్య ప్రజల కష్టార్జితం ప్రమాదంలో పడటం దురదృష్టకరమని, కానీ ప్రభుత్వం మానవతా దృక్పథంతో బాధితులకు పూర్తి రక్షణ కల్పిస్తుందని హామీ ఇచ్చారు.

కొంతమంది స్వార్థ రాజకీయ ప్రయోజనాల కోసం ప్రజలను భయపెట్టి, తప్పుదోవ పట్టించే అవకాశం ఉందని, వారి మాటలు నమ్మి ఆస్తులను తక్కువ ధరకు అమ్ముకోవద్దని సూచించారు. మీరు ఒంటరి వారు కాదు, మీ ప్రతి పైసాకు నేను జవాబుదారీగా ఉంటాను అని ఆయన భరోసా ఇచ్చారు. హైదర్గూడ మరియు ఉప్పరపల్లి పరిధిలో సుమారు 10 నుండి 12 ఎకరాల స్థలం నిషేధిత ప్రాంతంలో (బఫర్ జోన్) ఉందని, జలాశయాల నిబంధనల ప్రకారం వీటికి నిర్మాణ అనుమతులు లేవని ఆయన వివరించారు. అయినప్పటికీ బాధితులకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు.

## జాగ్రత్త మహిళా..!



గుంట నక్కలు ముసుగేసుకుని మన
చుట్టు తిరుగుతు మాయ మాటలు
చెప్పి నిన్ను మాయం చేస్తారు జాగ్రత్త
మహిళా..!
మహిళ చిరునవ్వుల చాటున
కన్నీటిచుక్కలు ఎవరికి తెలుసు...!

బడికి వెళ్లే ఆడ పిల్లపై నీ వెయ్యి
కన్నులు వేసి ఉంచు మహిళా..!
రెప్పపాటు ఆదమరచినావో
డేగ లాగా తన్నుకొని పోతారు జాగ్రత్త
మహిళా..!
మహిళ చిరునవ్వుల చాటున
కన్నీటిచుక్కలు ఎవరికి తెలుసు...!

పొలం పనుల కోసం పొయ్యేటప్పుడు
బుడ్డదాన్ని వెంట తీసుకునిపో...
మరచి పోయినావో కామాంధుల
కాటుకు బలై పోతుంది జాగ్రత్త
మహిళా..!
మహిళ చిరునవ్వుల చాటున
కన్నీటిచుక్కలు ఎవరికి తెలుసు...!

కూలి నాలికి పొయ్యేటప్పుడు చీడ
పురుగుల బారిన పడకుండా
నిండు వస్త్రధారణతో వెళ్లు...
మరచి పోయినావో చుట్టు ముట్టి
చిత్రవధ చేస్తారు జాగ్రత్త మహిళా..!
మహిళ చిరునవ్వుల చాటున
కన్నీటి చుక్కలు ఎవరికి తెలుసు...!

అంతా నావాళ్ళే అని గుడ్డిగా నమ్మకు
మహిళా..!
నీ వెనక గోతులు తీసేది నీ వాళ్ళే అని
తెలుసుకో మహిళా..!
మహిళ చిరునవ్వుల చాటున
కన్నీటి చుక్కలు ఎవరికి తెలుసు...!

సమాజంలో ఉన్న కొంత మంది
గురించి మాత్రమే వారు మంచిగా
మారుతారు అని ఆశిస్తు...

తరలిపో తరలిపో.. చీకటి నుంచి వెలుగుకు తరలిపో.. కుందేలువి కావు.. పులిలా మారిపో.. వెంటాడే ఒడిదుడుకుల మృగాలతో యుద్ధానికి తరలిపో..." ఓ మహిళా మీకివే మా వందనాలు. కంటిపాపలా కాపాడే 'స్త్రీమూర్తి'కి వందనాలు

-శ్రీమతి మంజుల పత్తిపాటి (కవయిత్రి)
మాజీ ఆలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్
యాదాద్రి భువనగిరి జిల్లా
తెలంగాణ రాష్ట్రం
చరవాణి 9347042218.

## మార్నింగ్ వాక్‌లో.... పారిశుద్ధ పనులను పర్యవేక్షించిన వైస్ చైర్మన్



**మోత్కూరు, ఫిబ్రవరి 24 (వార్త వేదిక సూర్య) :** మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని 1వ వార్డు పాత బస్టాండ్ వద్ద మంగళవారం తెల్లవారుజామున పారిశుద్ధ్య సిబ్బంది చేపడుతున్న పారిశుద్ధ్య పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ పల్లెర్ల వెంకన్న గుప్తా మార్నింగ్ వాక్‌లో క్షేత్రస్థాయిలో స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ ప్రజలకు, వ్యాపారులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా మెయిన్ రోడ్డు పై, ఇండ్లలో ఉన్న చెత్తా చెదారాన్ని (తడి, పొడిని) వేర్వేరు చేసి ప్రతిరోజు తరలించి ప్రజల ఆరోగ్యాలను సంరక్షించాలని పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. మున్సిపల్ సిబ్బంది సమయపాలన చేపట్టి పారిశుద్ధ్య నివారణకు పాటుపడాలన్నారు.

కార్మికులు ప్రతి నిత్యం ప్రధాన రోడ్లను శుభ్రపరచాలని వెంకన్న కోరారు కార్మికు లకు ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి నేరుగా తీసుకురావాలన్నారు.

# హనుమాన్ యూత్ అధ్వర్యంలో ఎంపిడిఓ కార్యాలయనికి లేఖ



**రామన్నపేట, (వార్త వేదిక సూర్య):** దాతల సహకారంతో నిర్మించిన కళా వేదిక తొలగింపు వారి మనోభావాలను దెబ్బ తీసే ప్రయత్నం జరుగుతుందని నిర్నేముల హనుమాన్ యూత్ అసోసియేషన్ సభ్యులు ఆరోపించారు. గ్రామంలో హమమాన్ యూత్ అసోసియేషన్ గత 12 ఏళ్లుగా ఈ సంస్థ వివిధ సామాజిక మరియు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోందనీ, గ్రామంలోని పాత పాఠశాల ప్రాంగణంలో తాము గ్రామస్తుల సహకారంతో గ్రామంలో ఆధ్యాత్మిక మరియు సాంస్కృతిక చైతన్యం కోసం, ముఖ్యంగా దేవి నవరాత్రుల వంటి పండుగల నిర్వహణకు పరిమాణంలో ఒక వేదికను నిర్మించినట్లు, ఇది ఏ ఒక్క వ్యక్తి స్వంతం కాదు, గ్రామస్తులందరి ఉమ్మడి ఆస్తి అని, ఈ వేదిక నిర్మాణం కోసం గ్రామస్తులు, భక్తులు మరియు దాతలు తమ కష్టార్జితాన్ని వెచ్చించారాన్నారు. ప్రభుత్వ ధనంపై భారం పడకుండా, సామాజిక బాధ్యతతో దీనిని నిర్మించడం జరిగిందన్నారు. ఈ వేదిక ప్రభుత్వానికి ఒక అదనపు సౌకర్యం వంటిదనీ, దీనివల్ల ప్రభుత్వ అవగాహన సదస్సులు, ఆరోగ్య శిబిరాలు మరియు గ్రామ సభలు నిర్వహించుకోవడానికి ఎంతో సులభమవుతుంది, తద్వారా ఇది భవిష్యత్తులో ఒక శాశ్వత ప్రజా వనరుగా ఉపయోగ పడుతుందన్నారు. ఇన్ని రకాలుగా ఉపయోగం కోసం నిర్మించిన వేదికను ప్రస్తుతం ప్రతిపాదించిన శ్రీ శక్తి భవన నిర్మాణానికి అవసరమైన ఖాళీ స్థలం ఇక్కడే అనే ఉద్దేశ్యంతో అక్కడ భవనాన్ని నిర్మించడానికి తగినంత వెసులుబాటు ఉన్నదని తొలగించే ప్రయత్నం చేస్తున్నారు. అన్ని కోణాల ఆలోచన చేసి రాజకీయ ఉద్దేశ్యాలు పక్కన పెట్టి సంబంధిత ఇంజనీరింగ్ అధికారుల ద్వారా క్షేత్రస్థాయిలో తిరిగి సర్వే చేయించి, పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో భవన నిర్మాణాన్ని చేపట్టాలని యూత్ అసోసియేషన్ సభ్యులు కోరారు.

# ఎల్లయ్య మృతి సిపిఎంకు తీరని లోటు

### సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్

**మోత్కూరు, (అడ్డగూడూరు) ఫిబ్రవరి 24 (వార్తా వేదిక సూర్య)** అడ్డగూడూరు మండల కేంద్రానికి చెందిన సిపిఎం పార్టీ మండల సీనియర్ నాయకులు గూడెపు ఎల్లయ్య మృతి సిపిఎం పార్టీకి తీరనిలోటని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి, ఎండి జహంగీర్ అన్నారు. మంగళవారం ఎల్లయ్య ఆకాల మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం ఆయన భౌతికయానికి ఎర్ర జెండా వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జహంగీర్ మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా సిపిఎం పార్టీలో ఒక నికార్సైన కమ్యూనిస్టు పార్టీ నాయకుడిగా ఉంటూ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాటాలు చేశారన్నారు. కమ్యూనిస్టు నాయకునిగా సిపిఎం పార్టీ జెండానే అజెండాగా మార్చుకొని పోరాటాలు నిర్వహించారని ఆయన సేవలను కొనియాడారు.. ఈ కార్యక్రమంలో సిపిఎం అడ్డగూడూరు, మోత్కూరు మండల కార్యదర్శులు బుర్రు అనిల్ , గుండు వెంకటనర్సు, మండల కమిటీ సభ్యులు శీలం శ్రీను, వల్లంబట్ల శ్రీనివాసరావు, చుక్క యాదగిరి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.





# మున్సిపల్ చైర్మన్ కు సన్మానాల వెల్లువ

- ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే లక్ష్యం
- చైర్మన్ పన్నీర్లపల్లి శ్రీవాణి రవికుమార్



**(యాదాద్రి భువనగిరి బ్యూరో) ఫిబ్రవరి 24 వార్త వేదిక సూర్య** భువనగిరి మున్సిపల్ నూతన చైర్మన్ తంజెల్లపల్లి శ్రీవాణి రవికుమార్ లకు వివిధ కుల సంఘాలు రాజకీయ పార్టీల నాయకులు స్వచ్ఛంద సంస్థలు అభిమానులు సన్మానాలు చేస్తూ తన అభిమానాన్ని చాటుకుంటున్నారు. శ్రీ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి దేవాలయం శబరి నగర్ లో ఆలయ వ్యవస్థాపక చైర్మన్ అయిత రాములు ఆధ్వర్యంలో చైర్మన్ దంపతులకు గణ సన్మానం చేశారు. కార్యక్రమంలో అధ్యక్షులు నూనె వెంకటేశ్వర్లు ఉపాధ్యక్షులు గాదె శ్రీనివాస్ సభ్యులు మంచాల ఋషికేష్ చీకటిమల్ల రాములు సోమన్న చంద్రశేఖర్ మాజీ చైర్మన్ మంచాల ప్రభాకర్ ఆలయ ప్రధాన అర్చకులు నరేంద్ర శర్మ పాల్గొన్నారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో శ్రీదేవి ఉత్సవ కమిటీ, కిరాణం అండ్ జనరల్ మర్చంట్ డిస్ట్రిబ్యూటర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ తంగళ్ళపల్లి శ్రీవాణి రవికుమార్ గార్లకు, వాడు కౌన్సిలర్ చిన్న స్వాతి మహేష్ గారికి శాలువాలు కప్పి ఘనంగా సన్మానం చేశారు. చైర్మన్ శ్రీవాణి రవికుమార్ మాట్లాడుతూ పట్టణాన్ని అందరి సహకారంతో సలహాలతో రాష్ట్రంలోని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తానని అన్నారు. ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం ద్వారా నిధులను తెచ్చి పట్టణాన్ని అభివృద్ధి చేస్తానని పేర్కొన్నారు.



## నాలాందా నగర్‌లో క్యూఆర్ కోడ్ సేవలను పరిశీలించిన జీహెచ్‌ఎంసీ కమీషనర్ ఆర్ వి కర్ణన్

**మైలర్ దేవ్ పల్లి, ఫిబ్రవరి 24 (వార్త వేదిక సూర్య) :** హైదర్‌గూడ నాలాందా నగర్‌లో ప్రారంభించిన పైలట్ కార్యక్రమం ద్వారా క్యూఆర్ కోడ్ ఆధారిత పౌర సేవలను అందుబాటులోకి తీసుకువచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని జీహెచ్‌ఎంసీ కమీషనర్ ఆర్ వి కర్ణన్, జోనల్ కమీషనర్ అనురాగ్ జయంతి, డిప్యూటీ కమీషనర్ సమ్మయ్య పరిశీలించారు. ప్రజలు తమ ప్రాంతంలో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి పారిశుద్ధ్యం, చెత్త సేకరణ, వీధి దీపాలు, డ్రైనేజీ వంటి సమస్యలను నేరుగా నమోదు చేయవచ్చు.



ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు. అందువల్ల రాజేంద్రనగర్ జోన్ పరిధిలోని ప్రజలందరూ ఈ క్యూఆర్ కోడ్ సేవలను వినియోగించుకుని తమ సమస్యలను ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని కోరారు.

## మేడిబావిలో పర్యటించిన మాజీ కార్పొరేటర్ డాక్టర్ హేమ సామల



**సికింద్రాబాద్, ఫిబ్రవరి 24(వార్త వేదిక సూర్య)** మేడి బావి ప్రాంతంలోని శ్రీ సాయి విద్యాలయం సమీపంలో కొనసాగుతున్న సివరేజీ పనులను సీతాఫల్మండి డివిజన్ మాజీ కార్పొరేటర్ డాక్టర్ హేమ సామల వివిధ అధికారులతో కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. స్థానిక నివాసితుల నుంచి పనులు ఆలస్యంగా జరుగుతున్నాయనే ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఆమె అక్కడికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడిన డాక్టర్ సామల హేమ గారు, సివరేజీ పైప్‌లైన్ వేస్తున్న సమయంలో భూమిలో భారీ బండరాయి ఎదురైనందున పనులు కొంత ఆలస్యమయ్యాయని తెలిపారు. సాంకేతిక ఇబ్బందులు ఎదురైనా పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని హామీ ఇచ్చారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అలాగే ఇటీవల అనుకోకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో నాలాలు ఉప్పొంగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఇందిరా నగర్ రోడ్ నం. 2 ప్రాంతంలోని నాలాలో మట్టి పూడికతీత పనులను చేపట్టినట్లు చెప్పారు. వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో జిహెచ్ ఎం సి ఏ ఈ వేణు,జలమండలి మేనేజర్ కుషాల్ తదితరులు పాల్గొన్నారు.

# జీపీఓలకు మొబైల్ యాప్లు..

**(యాదాద్రి భువనగిరి బ్యూరో)ఫిబ్రవరి 24 వార్త వేదిక సూర్య**



పారదర్శకంగా, వేగవంతంగా అందించేందుకు కొత్త వ్యవస్థను తీసుకురావడా నికి రాష్ట్ర ప్రభుత్వం మొబైల్ యాప్ తీసుకువచ్చింది. రాష్ట్ర వ్యాప్తంగా పౌరసేవల దరఖాస్తుల విచారణ కాగిత రహితం(పెపర్ లెస్)గా చేపట్టనుంది. ఆయా దరఖాస్తుల వివరాలపై రెవెన్యూ సిబ్బంది విచారణతోపాటు ఇచ్చే నివేదిక ప్రక్రియ మొత్తం ఇక ఆన్లైన్లో కొనసాగనున్నది. ఇందు కోసం గ్రామ పాలనాధికారులకు (జీపీఓ) కొత్తగా మొబైల్ యాప్లను ప్రభుత్వం అందు బాటులోకి తీసుకువచ్చింది. గత కొంత కాలంగా యాదాద్రి భువనగిరి జిల్లా (5) గ్రామాల్లో జీపీఓల ద్వారా పైలట్ దరఖాస్తులపై మొబైల్ యాప్ పనితీరును రెవెన్యూ అధికారులు పరిశీలించారు. తద్వారా ఈ యాప్ ఆచరణలో సాంకేతికం గా తలెత్తుతున్న అంశాలను అధికారులు ఎప్పటిక ప్పుడు పరిశీలిస్తూ అందుకనుణంగా మార్పులు, చేర్పులు చేశారు. ప్రస్తుతం పైలట్ దశలో ఉన్న మొబైల్ యాప్లో సాంకేతిక అడ్డంకులన్నీ అధిగమించి పూర్తి స్థాయి అప్లికేషను నేటి నుండి (జీపీఓ) లకి అందుబాటులో వచ్చింది, దీనిపై (జీపీఓ) లకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, భువనగిరి ఆర్డీవో కృష్ణ రెడ్డి, జగన్ మోహన్ ప్రసాద్, పరిపాలనాధికారి (మీసేవ) కల్లెక్టరేట్, సాయి కుమార్, ఇ-జిల్లా మేనేజర్ మరియు అన్ని మండలాల తహసిల్దార్లు , రెవిన్యూ ఇన్స్పెక్టర్, జీపీఓలు పాల్గొన్నారు.

## చిన్నారిని హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలి

### బిఆర్ఎస్ డిమాండ్

**మోత్కూరు, ఫిబ్రవరి 24 (వార్త వేదిక సూర్య) :** నాగర్ కర్నూల్ జిల్లా కుర్మెర జాతరలో రజక సామాజిక వర్గానికి చెందిన చిన్నారిని హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి (బి.ఆర్.ఎస్ఎస్). రాష్ట్ర అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . మంగళవారం ఈ మేరకు స్థానిక శ్రీకాంతాచారి చౌరస్తా వద్ద చిన్నారి హత్య చేసిన దుండగులను శిక్షించాలని కోరుతూ చిన్నారికి క్రొవ్వుతులతో నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాల సమితి మండల పట్టణ అధ్యక్షులు శివార్ల శ్రీనివాస్ యాదవ్, నిలిగొండ మత్స్య గిరి, స్థానిక నాయకులు బుశిగంపల సందీప్, చేతరాశి వెంకన్న, రజక సంఘం నాయకులు బొడ్డుపల్లి మైసయ్య, కూసంపల్లి సోమ నర్సయ్య, కూసంపల్లి యాకయ్య బొడ్డుపల్లి మహేష్ బొడ్డుపల్లి శివాజీ, బొడ్డుపల్లి సర్వయ్య, అవిశెట్టి కిరణ్, బందెల రవి అబ్బయ్య బొడిగె శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# గ్రామపంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయడం పట్ల హర్షం

మోత్కూరు, ఫిబ్రవరి 24 (వార్త వేదిక సూర్య) :



గత రెండేళ్ల నుంచి గ్రామపంచాయతీలకు నిధులు లేక పారిశుద్ధ లోపాన్ని గుర్తించి న కేంద్ర ప్రభుత్వం 15వ, ఆర్థిక సంఘం నుంచి రాష్ట్రంలో 427 గ్రామపంచాయతీ ఖాతాలలో 7.59 కోట్ల రూపాయలు జమ చేసిందని భాజపా జిల్లా ఉపాధ్యక్షులు బయ్యాని చంద్ర శేఖర్ అన్నారు. మంగళవారం నాడు మోత్కూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ పంచాయితీల సాధారణ ఖర్చులు, కార్మికులకు వేతనాలు కూడా ఇవ్వలేని ఇబ్బందులు పరిస్థితి ఏర్పడిందన్నారం ఈ కేంద్ర నిధులతో 60 శాతం నిధులు పారిశుధ్యం, తాగునీటి అవసరాలకు వినియోగించుకోవచ్చునని అన్నారు. గ్రామపంచాయతీ నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేయడం పట్ల చంద్రశేఖర్ హర్షం వ్యక్తం చేశారు.

# ప్రజా సమస్యలలో రెడ్డి ప్రజా ప్రతినిధులు ముందుండాలి



మోత్కూరు, ఫిబ్రవరి 24 ( వార్తా వేదిక సూర్య):

మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల జరిగినఎన్నికల్లో 5, 8వ వార్డుల నుండి కౌన్సిలర్‌లుగా ఎన్నికైన మొగుళ్ళ అనురాధ,శ్రీనివాస్ రెడ్డి పన్నాల శ్రీవిద్య, శ్రీనివాస్ రెడ్డి లను మంగళవారం మోత్కూరు పట్టణ రెడ్డి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రెడ్డి సంక్షేమ సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని సూచించారు. ప్రతి నిత్యం పేద ప్రజలకు అండగా ఉండి మంచి పేరు సంపాదించాలని ఆకాంక్షించారు ఈ కార్యక్రమంలో రెడ్డి సంక్షేమ సంఘం పట్టణ అధ్యక్షులు లింగాల జైపాల్ రెడ్డి స్థానిక నాయకులు డాక్టర్ లక్ష్మీ నర్సింహ్మా రెడ్డి, పైళ్ళ సోమిరెడ్డి, కొనతం నాగార్జున రెడ్డి, ముప్పా వెంకటరెడ్డి ,సోలిపురం చంద్రారెడ్డి, అర్ద ప్రతాప్ రెడ్డి, బద్దం నాగార్జున్ రెడ్డి,పసునూరి చంద్రా రెడ్డి, ఆమనగంటి వెంకట్ రెడ్డి, గంట వేమల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పాలడుగులో జాతీయ సహజ వ్యవసాయ మిషన్ పైఅ వగాహన సమావేశం



మోత్కూరు, ఫిబ్రవరి 24 (వార్తా వేదిక సూర్య)

రసాయన వినియోగాన్ని తగ్గించి సహజ జీవ ఎరువులు, జీవ పురుగుల మందులను మాత్రమే వినియోగించాలని మండల వ్యవసాయ విస్తరణ అధికారి వడ్డేమాన్ కీర్తి అన్నారు. మండలంలోని పాలడుగు గ్రామంలో మంగళవారం జాతీయ సహజ వ్యవసాయ మిషన్ పై అవగాహన సమావేశం ఆమె అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కీర్తి మాట్లాడుతూ ఎరువులు పురుగుల మందులు కలుపు మందుల వినియోగం వల్ల భూమి నీరు కాలుష్యం పెరుగుతుండడంతో పాటు మానసిక ఆరోగ్యం పై ప్రతికూల ప్రభావాలు కలుగుతున్నాయని తెలిపారు. రైతులు సాంప్రదాయ సహజ వ్యవసాయ పద్ధతులపై మారాల్సిన అవసరాలను వివరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి సింహ ప్రసాద్ , ఆ గ్రామ రైతులు యాస సోమిరెడ్డి, అంతటి వెంకటయ్య ముప్పిడి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

# చిలుకూరు గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మున్సిపల్ వైస్ చైర్మన్ గరుగురాజు ముదిరాజ్

మొయినాబాద్ మున్సిపాలిటీ ఫిబ్రవరి 24 (వార్త వేదిక సూర్య)

మొయినాబాద్ మున్సిపాలిటీ చిలుకూరులో గ్రామస్తులను సమస్యలు అడిగి తెలుసుకుంటున్న మున్సిపల్ వైస్ చైర్మన్ గరుగు రాజు ముదిరాజ్ ఆయన గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్న ఒక్కొక్కటిగా అన్ని సమస్యలు లేకుండా ఎలాంటి సమస్యలు లేకుండా చూసుకుంటానని చేసింది చాలా తక్కువ అని చేయాల్సింది చాలా ఉందని ఆయన గ్రామస్తులకు తెలిపారు సమస్యలు చెప్పిన వెంటనే సానుకూలంగా స్పందించి సమస్యలు లేకుండా చూసుకుంటానని చెప్పడంతో గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేశారు.








# అప్పుల కుప్పగా మారిన గ్రామ పంచాయతీలు

- నిధులు కేటాయించకుండా అభివృద్ధి ఎలా సాధ్యం?
- నూతన పాలకవర్గాలకు నిధులు కేటాయించాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి జహంగీర్

రామన్నపేట (వార్త వేదిక సూర్య):

కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు గ్రామపంచాయతీలకు కనీసం నిధులు కేటాయించకుండా కాలయాపన చేస్తే గ్రామాల అభివృద్ధి ఎలా సాధ్యమని సిపిఎం జిల్లా కార్యదర్శి ఎండి జహంగీర్ విమర్శించారు.వెల్లంకి గ్రామంలో రఘురామ ఫంక్షన్ హాల్ లో జరిగిన సిపిఎం మండల రాజకీయ శిక్షణ తరగతులు రెండవ రోజు సందర్భంగా ముఖ్యఅతిథిగా హాజరైన జహంగీర్ మాట్లాడుతూ గత రెండున్నర సంవత్సరాల నుండి గ్రామపంచాయతీలకు పైసా విదల్చకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి కొంటుబడి పోయిందని అన్నారు.ఇటీవల గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించి చేతులు దులుపుకుంటే ఎలా అని ఎద్దేవా చేశారు.కనీసం గ్రామపంచాయతీ కార్మికులకు జీతాలు ఇవ్వలేని పరిస్థితిలో గ్రామపంచాయతీలు కాలమెల్ల తీస్తున్నాయని నూతనంగా ఎన్నికైన సర్పంచులు లక్షల రూపాయలు తమ చేతుల్లో నుండి ఖర్చు పెడుతూ అప్పుల పాలవుతున్నారని వాపోయారు. గ్రామ సీమలే దేశానికి పట్టుకొమ్మలు అన్న విషయాన్ని కేంద్రంలో ఉన్న బిజెపి రాష్ట్రంలో ఉన్న కాంగ్రెస్ విస్మరిస్తున్నాయని అన్నారు. 15వ ఆర్థిక సంఘం నిధులు పూర్తి స్థాయిలో విడుదల చేయటంలో కేంద్రంలో ఉన్న బీజేపీ నిర్లక్ష్యం సరికాదాన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రాబోయే బడ్జెట్ లో గ్రామాలకు ప్రత్యేక నిధులు కేటాయించాలని అన్నారు.ఇప్పటికే పారిశుధ్యం పడకేసి ప్రజా ఆరోగ్యం నిర్వీర్యం అవుతుందని ఎన్నికలు నిర్వహించి అభివృద్ధికి నిధులు కేటాయించకుండా కాలయాపన చేయటం సరికాదని అన్నారు.గ్రామ పంచాయతి కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించకపోవడంతో ఇల్లు గడవని పరిస్థితి నెలకొన్నదని, గత 5 సంవత్సరాలుగా నూతన పింఛన్ ఇవ్వకపోవడంతో గ్రామాల్లో అనేక మంది వృద్దులు,వికలాంగులు, వితంతువులు గ్రామ పంచాయతి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని అన్నారు.నెలల తరబడి కనీసం కరెంట్ బిల్లులు కట్టలేని దీన స్థితిలో గ్రామ పంచాయతీలు ఉన్నాయని అన్నారు. వెంటనే గ్రామ పంచాయతీలకు నిధులు కేటాయించి గ్రామాల అభివృద్ధికి పాటుపడాలని అన్నారు. ఈ కార్యక్రమంలోరైతు సంఘం జిల్లా అధ్యక్షులు మేక అశోక్ రెడ్డి,జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జల్లెల పెంటయ్య, మండల కార్యదర్శి బొడ్డుపల్లి వెంకటేశం,జిల్లా కమిటీ సభ్యులు బల్గూరి అంజయ్య,వనం ఉపేందర్, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కూరెళ్ళ నర్సింహా చారి, బోయిని ఆనంద్, జంపాల అండాలు, కందుల హనుమంతు, కల్లూరి నగేష్, మండల కమిటి సభ్యులు ఆవనగంటి నగేష్, గన్నేబోయిన విజయభాస్కర్, గాదె నరేందర్,గొరిగే సోములు, వేముల సైదులు,బావండ్లపల్లి బాలరాజు, నీల ఐలయ్య, బోడిగే రజిత, ఎండీ రషీద్, తొలుపునూరి శ్రీనివాస్, దుబ్బాక సర్పంచ్ గట్టు నర్సింహా, మేడబోయిన శ్రీనివాస్, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు గంటెపాక శివ కుమార్, పులి బిక్షం, మునికుంట్ల లెనిన్, తాళ్లపల్లి జితేందర్, పావిరాల మత్యగిరి తదితరులు పాల్గొన్నారు.

# హోత్సవాల సందర్భంగా ప్రధాన రహదారినీ పరిశీలించిన మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్



యాదగిరిగుట్ట /ఫిబ్రవరి 24 /వార్తా వేదిక సూర్య :

మున్సిపల్ చైర్మన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ మంగళవారం ఉదయం ఆరు గంటల ప్రాంతంలో బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రధాన రహదారి నీ పరిశీలించారు. పారిశుధ్యకార్మికులకు పలు సూచనలు చేశారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజల ఆరోగ్యలు బాగుంటాయని అన్నారు. ప్రధాన రహదారి వెంట ఉన్న వ్యాపారస్తులకు చెత్తను రోడ్ల పైన వేయరాదని డస్ట్ బిన్లు ఉపయోగించుకోవాలని వ్యాపారస్తులకు పలు సూచనలు చేశారు. పారిశుద్ధ్య కార్మికులకు మాస్కులు అందజేశారు. మాస్కులు ధరించకుండా పారిశుద్ధ్య పనులు చేస్తే ఆరోగ్యాలు దెబ్బతింటాయానీ పారిశుద్ధ్య కార్మికులకు పలు సూచనలు చేశారు. బ్రహ్మోత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలవకుండా వాహనాల పార్కింగ్ ఏర్పాటు కొరకు హై స్కూల్ గ్రౌండ్ లో ఉన్న చెట్టును తీసేసి పారిశుద్ధ్యం చేస్తున్నామని వారు తెలిపారు . ఈ కార్యక్రమంలో పలు వార్డుల మున్సిపల్ కౌన్సిలర్లు మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

# శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు

ఆలేరు, వార్త వేధిక సూర్య :

ఆలేరు నియోజకవర్గంలోని కైలాసపుర కాచారం గ్రామంలో ఉన్న శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి దేవాలయంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. డాక్టర్ వంగపల్లి అంజయ్య స్వామి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అన్నప్రసాద వితరణ, మృత్యుంజయ పసుపు--కుంకుమ సన్మానం, తీర్థప్రసాదాల పంపిణీ తదితర కార్యక్రమాలు నిర్వహించి భక్తులకు ఆశీర్వాదాలు అందించారు. ఈ సందర్భంగా ఆలేరు మాజీ జెడ్పిటిసి, రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఇంచార్జ్ కోఆర్డినేటర్, యాదాద్రి భువనగిరి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు నీలం పద్మ, ఆలేరు కాంగ్రెస్ పార్టీ మాజీ నియోజకవర్గ ఇంచార్జ్, రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ నీలం వెంకటస్వామి దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని వారికి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక సన్మానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలేరు మున్సిపాలిటీ చైర్మన్ బీజని బాలమణి భాస్కర్, కౌన్సిలర్లు బిజిని కళ్యాణి మధు, పాకాల హరీష్ మౌనిక, తదితర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. పూజా కార్యక్రమానికి ఫెడ్‌గ్రామ్స్ అధ్యక్షులు కొత్తూరు నాగరాజు, జయశ్రీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సిద్దిపేటకు చెందిన వ్యాపారవేత్త చింతరాం దంపతులు అన్నదాతలుగా వ్యవహరించి అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఆలేరు మున్సిపల్ చైర్మన్ అమ్మవారికి మొక్కు చెల్లించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమం అనంతరం భక్తులకు ఓడి బియ్యం పంపిణీ చేశారు.







# మున్సిపల్ చైర్మెన్ వైస్ చైర్మెన్‌లను సన్మానం

మోత్కూరు, ఫిబ్రవరి 24 (వార్త వేదిక సూర్య)

ఇటీవల మున్సిపల్ బాధ్యతలు తీసుకున్న చైర్ పర్సన్ గడ్డం స్వప్న, సోమ నర్సయ్య, వైస్ చైర్మెన్ పల్లెర్ల వెంకన్నలకు మంగళవారం మున్సిపల్ పరిధిలోని ధర్మపురం కాంగ్రెస్ నాయకులు శాలువాలతో ఆత్మీయ సన్మానం చేశారు.

ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు వర్రె మహేందర్, అంకర్ల రమేష్, వర్రె లింగయ్య , కృష్ణారెడ్డి వర్రె సోమయ్య , జినుకల లింగయ్య, అంబటి నాగరాజు మంద్ర మహేష్ తదితరులు పాల్గొన్నారు.





# రాజ్యసభ సీటు బీసీలకే కేటాయించాలి

**బిబిబీసీ రిజర్వేషన్ సాధన సమితి**

**రాష్ట్ర ఉపాధ్యక్షులు సోము యాదవ్**



మోత్కూరు: ఫిబ్రవరి 24 (వార్త వేదిక సూర్య)

తెలంగాణ రాష్ట్రం నుంచి మార్చి నెలలో మట్టికానున్న రెండు రాజ్యసభ స్థానాలలో ఒకటి బీసీలకు మరొకటి ఎస్సీ ఎస్టీలకు కేటాయించాలని బీసీ రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షులు జంగ సోము యాదవ్ డిమాండ్ చేశారు. మంగళవారం నాడు ఆయన మోత్కూరులో విలేకరులతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కులగనన జరిపి జనాభా నిష్పత్తి ప్రకారం వాటా కేటాయించాలని కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ వాక్యాలు దేశంలో బహుజన స్ఫూర్తినిచ్చాయని అన్నారు. ఆలోచనలను కాంగ్రెస్ పాలిత తెలంగాణ రాష్ట్రంలో ఆచరణ పెట్టాలని కోరారు. రాజ్యసభ సీట్లను అగ్రకుల ధనవంతులకు అలంకారం లాంటిధైతే బీసీలకు ఆస్తిత్వం లాంటిధని పెద్దల సభలకు పేదల హక్కుల కోసం పోరాడే వారిని కాకుండా.స్కాములు చేసే గద్దెలకు అవకాశం ఇవ్వకూడదన్నారు. దేశంలో బహుజనులు గళం విప్పుతున్న రాహుల్ గాంధీ రాజ్యసభ సీట్లపై బీసీ ఎస్సీ ఎస్టీలకు అవకాశం కల్పించే విధంగా చొరవ చూపాలని సోము యాదవ్ కోరారు.

# ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్న విద్యార్థిని విద్యార్థులకు శుభాకాంక్షలు

**రామినేని వెంకటేశ్వర్లు(ఆర్.వి)**



సికింద్రాబాద్, ఫిబ్రవరి 24(వార్త వేదిక సూర్య)

బుధవారం నుంచి ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్న విద్యార్థిని విద్యార్థులకు తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టియుటిఎఫ్) రాష్ట్ర అధ్యక్షులు, పెరిక పురగిరి క్షత్రియ కుల సంఘం, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు రామినేని వెంకటేశ్వర్లు(ఆర్.వి) శుభాకాంక్షలు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయనా మాట్లాడుతూ... ప్రియమైన విద్యార్థులారా మీ కష్టానికి మీ కలలకు మీ ఆశయానికి పరీక్షలు ఒక మెట్టు దిగువ మాత్రమే మీరు మీ లక్ష్యాన్ని చేరుకోవాలంటే ధైర్యంగా ముందుకు సాగాలి, ఆత్మవిశ్వాసంతో ముందుకు అడుగేయాలి. ఈ బోర్డు పరీక్షలు మీ భవిష్యత్తు బలమైన బాట వేయాలని ఆకాంక్షిస్తున్నాను.

# ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి



మోత్కూరు, ఫిబ్రవరి 24 (వార్తా వేదిక సూర్య)

మోత్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నేటి నుంచి జరగనున్న ఇంటర్మీడియట్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కళాశాల పరీక్ష కేంద్రం చీఫ్ సూపరిండెంట్ పి. విజయలక్ష్మి, డిఓ కవిత తెలిపారు. బుధవారం నుంచి ఇంటర్ ప్రథమ పరీక్ష జరగనున్న నేపథ్యంలో జూనియర్ కళాశాలలో అన్ని గదులలో హాల్ టికెట్ నెంబర్లను వేసే సరళిని వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ విజయలక్ష్మి కవిత మాట్లాడుతూ పరీక్ష కేంద్రంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలకు 545 మంది విద్యార్థులు హాజరుకానున్నారని ఇందులో జనరల్ విద్యార్థులు 417, ఒకేషనల్ 128 మంది ఉన్నారని పేర్కొన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించే ఈ పరీక్షకు 30 నిమిషాల ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కోరారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో యూరియా కొరత



వలిగొండ :ఫిబ్రవరి 24 (వార్తా వేదిక సూర్య)

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి యూరియా యాప్ ను రద్దుచేసి రైతులందరికీ యూరియా తక్షణమే అందజేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు తుమ్మల వెంక రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంలో రోజుకొక మాయ మాటలు చేస్తున్నారు. ఎన్నడూ లేని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తూ యూరియా కొరత కోసం చాలా ఇబ్బందులు పడుతున్న రైతును పనికిరాని యాప్ పెట్టి రైతులను మోసం చేస్తున్న రేవంత్ ప్రభుత్వం నువ్వు రైతు కుటుంబం నుండి వచ్చిన వ్యక్తి కాదా ఒకసారి ఆలోచించు అని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా మాజీ జెడ్పిటిసి మొగుళ్ల శ్రీనివాస్ మాట్లాడుతూ యూరియా కోసం కాంగ్రెస్ ప్రభుత్వం యాప్ ను ఉపయోగిస్తే ఈరోజు చదువుకొని రైతులు ఏ విధంగా యాప్ ఓపెన్ చేస్తారు. ఒకసారి ప్రభుత్వం ఆలోచించాలి రైతులకు ఇప్పటివరకు రైతు భరోసా ఎక్కడ పోయింది విదేశాలకు పోయిందా అని ప్రభుత్వ హెచ్చరించారు. రైతులకు ఎన్నడు లేని యాప్ కొత్త నిబంధనలు పాటించడం కాంగ్రెస్ ప్రభుత్వానికి సిగ్గుచేటు అని ఆయన అన్నారు. ఇప్పటికైనా యాప్ తీసివేసి పాత పద్ధతిలో కొనసాగించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సిగ్గు తెచ్చుకొని రైతులకు ఇబ్బంది కలగకుండా చూడాలని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మండల నాయకులు గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 27 సంవత్సరాల విరామం తర్వాత ఎన్నికల కమిషనర్ల జాతీయ రౌండ్ టేబుల్ సమావేశం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 24 (వార్తా వేదిక సూర్య):

ఢిల్లీలోని భారత్ మండపంలో మంగళవారం జరిగిన,రాష్ట్ర ఎన్నికల కమిషనర్ల జాతీయ రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ శ్రీమతి. ఐ.రాణి కుముదిని పాల్గొన్నారు. ఈ రౌండ్ టేబుల్ సమావేశానికి ప్రధాన ఎన్నికల కమిషనర్ శ్రీ జ్ఞానేష్ కుమార్, ఎన్నికల కమిషనర్లు డాక్టర్ సుఖ్‌బీర్ సింగ్ సంధు,డాక్టర్ వివేక్ జోషి అధ్యక్షత వహించారు. 27 సంవత్సరాల విరామం తర్వాత ఈ రౌండ్ టేబుల్ సమావేశం జరుగడం విశేషం. చివరి రౌండ్ టేబుల్ సమావేశం 1999 సంవత్సరంలో జరిగింది.

## కోటి కాల్పుల కేసు నిందితులు అరెస్టు

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (వార్తా వేదిక సూర్య):

కోటి కాల్పుల కేసు నిందితులను అరెస్టు చేసామని టాస్క్ ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ వెల్లడించారు. డీసీపీ మాట్లాడుతూ జనవరి 31న రాబరీ జరిగింది. కాల్పులు జరిపి 6 లక్షల రూపాయలు దోచుకెళ్లారు. మహమ్మద్ తయ్యాబ్ త్యాగి తోపాటు తుర్కాన్ అహ్మద్ అరెస్ట్ అయ్యారు. మొత్తం ఐదుగురు ప్రమేయం ఉందని అన్నారు. ఖైరతాబాద్, సికింద్రాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు కలిసి నిందితులను పట్టుకున్నారు. తయ్యబ్ త్యాగి.. హైదరాబాద్ లో క్యాబ్ నడుపుతున్నాడు. క్యాబ్ నడుపుతూనే ఏటీఎం సెంటర్ల వద్ద రెక్కీ నిర్వహించేవాడు. రెగ్యులర్ పెద్ద మొత్తంలో ఎవరు.. ఎక్కడ డబ్బులు విత్ డ్రా చేస్తారు అనే వివరాలు సేకరించి పెట్టుకున్నాడు. వివరాలు యూపిలో ఉన్న తన టీం కి చేరవేశాడు. దాంతో తుర్కాన్ అహ్మద్, ఫహీం హైదరాబాద్ చేరుకుని.. కోఠి ఎస్బీఐ వద్ద కాల్పులు జరిపారు. ఘటన జరిగిన తర్వాత సిసి కెమెరాలు అన్నీ పరిశీలించి.. టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా నిందితులను పట్టుకున్నామని అన్నారు.

## ఏటీఎం వాహనం డ్రైవర్ అరెస్టు

గచ్చిబౌలి, ఫిబ్రవరి 24 (వార్తా వేదిక సూర్య):

ఎటిఎంలకు నగదు సరఫరా చేస్తున్న వాహనం నుండి డబ్బులు ఎత్తుకెళ్లిన డ్రైవర్ అజిత్(34)ను గచ్చిబౌలి పోలీసులు అరెస్టు చేసారు. నార్సింగి డివిజన్ ఏసీపీ రమణ గౌడ్ మాట్లాడుతూ ఈ నెల 12న గోపన్ పల్లి తండాలో సంఘం ఏజెన్సీకు సంబందించిన వెహికల్ ఎటిఎంలో డబ్బులు లోడ్ చేయడానికి వచ్చారు. డబ్బులు ఎటిఎంలో లోడ్ చేయడానికి మిగతా సిబ్బంది వెళ్లారు. వాహనంలో మిగతా డబ్బులు ఉండడంతో అదే అదునుగా భావించి డబ్బుతో అజిత్ ఊడాయించాడు. తోటి సిబ్బంది అరా తీయగా దాదాపు రెండు గంటల పాటు వివిధ ప్రాంతాల్లో తిరుగుతూ తప్పించుకున్నాడు. తెల్లాపూర్‌లో గద్దర్ చౌరస్తా వద్ద ఆటో మాట్లాడుకొని ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని ఓ లాడ్జిలో వున్నాడు. ట్రంక్ పెట్టెలో వున్న నగదును బ్యాగ్‌లో వేసుకొని అనంతపురం వెళ్ళాడు. అనంతపురం నుండి బళ్లారి, పూణే, బెంగుళూరు తదితర ప్రాంతాలకు పారిపోయాడు. మూడు బృందాలుగా ఏర్పడిన పోలీసులు మంగళవారం ఉదయం శంషాబాద్ ఎయిర్ పోర్ట్‌లో పట్టుకున్నాం. 22లక్షలు జల్సాలకు వాడుకోని, 34లక్షల90వేల నగదు స్వాదినం చేసుకున్నా మని అన్నారు.

## వివిధ విభాగాల పని తీరుపై టీటీడీ అదనపు ఈవో సమీక్ష

తిరుమల, ఫిబ్రవరి 24 (వార్తా వేదిక సూర్య):

టీటీడీలోని వివిధ విభాగాల్లో ఎన్నో ఏళ్లుగా పేరుకుపోయిన స్క్రాప్ తొలగింపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని టీటీడీ అదనపు ఈవో సి. హెచ్.వెంకయ్య చౌదరి అధికారులను ఆదేశించారు. తిరుమలలోని పద్మావతి అతిథి గృహంలో గల సుధర్మ సమావేశ మందిరంలో మంగళవారం ఆయన వివిధ విభాగాల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీటీడీలోని అన్ని విభాగాల్లో ఉన్న స్క్రాప్ ను గుర్తించి 15 రోజుల్లో రిపోర్ట్ అందించాలని అధికారులను ఆదేశించారు. ఆరు నెలలకు ఒకసారి ప్రతి విభాగంలో స్క్రాప్ తొలగింపునకు షెడ్యూల్ రూపొందించాలన్నారు. వేలం ద్వారా ఆ స్క్రాప్ ను ఎప్పటికప్పుడు విక్రయించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఫీడ్ బ్యాక్ వ్యవస్థ అద్భుత ఫలితాలు ఇస్తోందని, దీనిని ఇదేవిధంగా కొనసాగించాలని చెప్పారు. భక్తుల నుండి సేకరించిన అభిప్రాయాలతో తిరుమలలో ప్రజా రవాణా, అన్న ప్రసాదం, పారిశుద్ధ్య సేవలు విశేషంగా మెరుగయ్యాయని తెలిపారు. ఇదే స్ఫూర్తితో ఎఫ్ఎంఎస్, కళ్యాణకట్ట, లగేజ్ సెంటర్లపై ప్రత్యేక సమావేశం నిర్వహించి భక్తులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు కార్యాచరణ రూపొందించాలని అన్నారు. భక్తులు విరాళాలు అందించేందుకు వీలుగా తిరుమలలోని అశ్వినీ ఆసుపత్రిలో కూడా కియోస్క్ యంత్రాలను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన పలు ఇంజినీరింగ్ పనుల పురోగతిపై సమీక్షించారు.

## ఫీజులు ఇస్తావా.. గద్దె దిగుతవా..
# సీఎం తేల్చుకోవాలి

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (వార్తా వేదిక సూర్య):

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ముచ్చటగా మూడవసారి రాష్ట్ర బడ్జెట్ ప్రవేశపెడుతున్న గత ఐదు సంవత్సరాలుగా ఉన్న 7వేల కోట్ల ఫీజుల బకాయిలు మాత్రం విడుదల చేయకుండా పేద విద్యార్థుల ఉసురు తీసుకుంటుందని అఖిలపక్ష పార్టీల నేతలు విద్యార్థి సంఘాల నాయకులు, మేధావులు రాష్ట్ర ప్రభుత్వంపై తీవ్రంగా విరుచుకపడ్డారు.సోమాజిగూడ ప్రెస్ క్లబ్ లో బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో కాలేజీ విద్యార్థుల కన్నీటి చదువులు అనే అంశంపై అఖిలపక్ష పార్టీలు విద్యార్థి సంఘాలు మేధావులు బీసీ ఎస్సీ ఎస్టీ సంఘాల విస్తృతస్థాయి సమావేశం బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగింది, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొడుగు మహేష్ యాదవ్ అధ్యక్షత వహించగా జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్ సమన్వయం చేశారు. సమావేశంలో హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ, మల్కాజ్గిరి ఎంపీ ఈటల రాజేందర్, టిఆర్ఎస్ మాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్, ఎమ్మెల్సీ ఎల్ రమణ, జూలూరి గౌరీ శంకర్, తెలంగాణ విటల్, ప్రొఫెసర్ సంఘని మల్లేశ్వర్, తదితరులు హాజరయ్యారు. హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ ప్రభుత్వాలు విద్యాపై పెట్టిన పెట్టుబడిని పెట్టుబడి కోణంలో చూడకుండా మానవ వనరుల అభివృద్ధిగా చూడాలన్నారు, ముఖ్యంగా బడుగుల విద్య విషయంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరి తగదని తక్షణమే పేద విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజుల బకాయిలను చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.. బిజెపి పార్లమెంట్ సభ్యులు మాజీ మంత్రి ఈటల రాజేందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల రియంబర్స్మెంట్ సమస్యను ప్రైవేట్ కళాశాల యజమాన్యాల సమస్యగా చూస్తుందని, ఈ సమస్య రాష్ట్రంలో ఉన్నత విద్యను చదువుకుంటున్న లక్షల మంది విద్యార్థుల బాధగా చూడాలని అన్నారు రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్ని మార్లు విన్నవించిన ప్రభుత్వం బండరాయిలా మాదిరిందని కనీస స్పందన లేదని విమర్శించారు ఒకవైపు వాస ప్రభుత్వం వేల కోట్లు అప్పులు మీద అప్పులు చేస్తూ అప్పుల ఊబిలో కూరుకుపోయిందన్నారు, పాత బకాయిలు మేమెందుకు ఇస్తామంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం గత ప్రభుత్వాలలో రావలసిన రాబడిని బకాయిల రూపంలో వసూలు చేస్తుందని, ప్రభుత్వానికి రావలసిన పాత బకాయిలు వసూలు చేసినప్పుడు, విద్యార్థులకు ఇవ్వాల్సిన బకాయిలు ఎందుకు ఇవ్వడం లేదని ఆయన ప్రశ్నించారు.విద్యార్థుల శక్తిని, తెలంగాణ సమాజ పోరాట చరిత్రను రేవంత్ రెడ్డి తక్కువ అంచనా వేస్తున్నాడని, ఈ వైఖరి మార్చుకోకపోతే విద్యార్థులు తెలంగాణ సమాజం ఏకమై కాంగ్రెస్ ప్రభుత్వం గద్ది దింపడానికి సిద్ధంగా ఉన్నారని ఈటల హెచ్చరించారుమాజీ మంత్రి వి శ్రీనివాస్ గౌడ్, ఎల్ రమణలు మాట్లాడుతూ బీసీ ఎస్సీ ఎస్టీ విద్యార్థులు అంటే రాష్ట్ర ప్రభుత్వానికి లెక్క లేదని, అసెంబ్లీలో, బయట ఫీజుల రియంబర్స్మెంట్ నిధులు విడుదల చేయాలని పోరాటం చేస్తుంటే ప్రభుత్వం నయా పైసా కూడా విడుదల చేయకుండా పేద విద్యార్థులను ఉసురు తీసుకుంటుందని వారు తీవ్రంగా విమర్శించారు.

ఫీజు రియంబర్స్మెంట్ కోసం విద్యార్థి సంఘాలు చేస్తున్న పోరాటానికి టిఆర్ఎస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలియ జేస్తుందని, బకాయిల విడుదల కోసం ఈ బడ్జెట్లో నిధులు కేటాయించాలని వారు డిమాండ్ చేశారు .బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ చలనం లేని గాంధీ విగ్రహానికి 5 వేల కోట్లు ఖర్చు పెడతామని చెబుతున్న ప్రభుత్వం, 22 లక్షల మంది పేద విద్యార్థులు ఫీజుల రియంబర్స్మెంట్ రాక ఆత్మహత్యలు చేసుకుంటే ప్రభుత్వానికి కనికరం లేదని గాంధీ విగ్రహానికి అయ్యే ఖర్చు ఫీజుల రియంబర్స్మెంట్కు ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు ఫీజుల రియంబర్స్మెంట్ విడుదల చేయకుండా గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామంటే బీసీ సమాజ ఒప్పుకోదని ఆయన తెలిపారు దేశంలో ఒకవైపు ఏఐ జాతీయ సెమినార్ జరుగుతుంటే ఇంకొక వైపు ఫీజులు చెల్లించలేక పేద విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవడం సర్కార్ కు సిగ్గుచేటని, గత రెండు సంవత్సరాల రాష్ట్ర బడ్జెట్ లో పేదలకు ఎన్ని నిధులు ఖర్చు పెట్టారో , బడా కాంట్రాక్టర్లకు ఎన్ని నిధులు విడుదల చేశారు శ్వేత పత్రం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. బడ్జెట్ ఉన్నప్ప టికీ బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థుల ఫీజుల నిధులు ఇవ్వడానికి సీఎం రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం బట్టి విక్రమార్కకు మనసు రావడంలేదని, బడా కాంట్రాక్టర్లకు వేలకోట్లు దోచిపెడుతున్న ప్రభుత్వం బడుగుల విద్యకు నయా పైసా విధించకుండా అన్యాయం చేస్తుందని ఆయన ఆరోపించారు. ఫీజుల రియంబర్స్మెంట్ నిధులు తక్షణమే విడుదల చేయాలని రెండు రోజుల్లోనే సిఎస్‌ను, బీసీమంత్రులను, డిప్యూటీ సీఎంలను కలుస్తామని వారి నుంచి సానుకూల స్పందన రాకుంటే మార్చ్ 16వ తేదీ నుండి జరిగే అసెంబ్లీ సమా వేశాలను అడ్డుకుంటామని జాజుల శ్రీనివాస్ గౌడ్ తీవ్రంగా హెచ్చరించారు ఈ సమావేశంలో బిసి జేఏసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ , ఆమ్ ఆద్మీ పార్టీ అధ్యక్షులు హేమ సబీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాంకుర్మ గారు, రాష్ట్ర అధ్యక్షులు శేఖర్ సాగర , మహిళా సంఘం అధ్యక్షురాలు మని మంజరి గబీసీ ఉద్యోగుల సంఘం చంద్రశేఖర్ గౌడ్ , ప్రొఫెసర్ చలమల వెంకటేశ్వర్ గారు, బీసీ జేఏసీ జాజుల లింగం,టీజేఎస్ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షులు అరుణ్ కుమార్,పీడీఎస్ యు జనరల్ సెక్రెటరీ రాజేష్ గారు టిఆర్ఎస్వి జనరల్ సెక్రెటరీ జంగయ్య, టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు శివరాజ్, ఎస్సీ ఎస్టీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నరసింహా నాయక్, బీసీ విద్యార్థి జెఏసి చైర్మన్ బొల్లెపల్లి స్వామి, ఓ.యు జెఏసి నాయకులు విజయ్, ఈడిగ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 67సనత్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రిలో ఈఎస్ఐ వ్యవస్థాపక దినోత్సవం



హైదరాబాద్, ఫిబ్రవరి 24 (వార్తా వేదిక సూర్య):

సనత్‌నగర్ ఈఎస్ఐ ఆసుపత్రిలో నిర్వహించిన ఈఎస్ఐ వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమానికి రాష్ట్ర కార్మిక మరియు గనుల శాఖ మంత్రి డా. జీ. వివేక్ వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సెక్రటరీ దాన కిషోర్, ఈఎస్ఐసీ రీజినల్ డైరెక్టర్ రాజీవ్ లాల్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ దూరదృష్టితోనే కనీస వేతనాలు, కార్మికుల హక్కులు, వారి భద్రత కోసం ఈఎస్ఐ కార్పొరేషన్ స్థాపించబడిందని పేర్కొన్నారు. కార్మికుల సంక్షేమం కోసం తీసుకున్న ఆ నిర్ణయం దేశంలోని లక్షలాది కార్మిక కుటుంబాలకు ఆరోగ్య భరోసాను కల్పించిందన్నారు.తన కుటుంబానికి కార్మిక సంక్షేమంతో ప్రత్యేక అనుబంధం ఉందని, తన తండ్రి కేంద్ర మరియు రాష్ట్ర కార్మిక మంత్రిగా సేవలందించారని మంత్రి గుర్తు చేశారు. గతంతో పోలిస్తే ఈఎస్ఐ ఆసుపత్రుల్లో సదుపాయాలు విస్తృతంగా మెరుగుపడ్డాయని తెలిపారు.రోగికి వైద్యంతో పాటు ధైర్యం ఇవ్వడం కూడా వైద్యుల బాధ్యత అని మంత్రి సూచించారు. ప్రభుత్వ ఆసుపత్రులపై విమర్శలు వినిపించినా, ఈఎస్ఐ ఆసుపత్రుల సేవలపై పెద్దగా ఫిర్యాదులు రావని ఆయన అన్నారు .దేశంలోని పేదలకు అత్యవసరంగా అవసరమయ్యేవి విద్య, వైద్యం మాత్రమేనని మంత్రి స్పష్టం చేశారు. కార్పొరేట్ ఆసుపత్రులు లక్షల రూపాయల ఫీజులు వసూలు చేస్తున్న ఈ కాలంలో, ఈఎస్ఐ వంటి సంస్థలు కార్మికులకు నాణ్యమైన వైద్యసేవలను అందించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా కార్మికులకు వైద్య సేవల విషయమా లో చిత్తశుద్ధి తో పనిచేస్తోందని, ఈఎస్ఐ సేవలను మరింత విస్తరించేందుకు ముఖ్యమంత్రి శంషాబాద్‌లో కొత్త ఆసుపత్రి నిర్మాణానికి భూమి కేటాయించేందుకు సానుకూలంగా స్పందించారని వెల్లడించారు.చెన్నూరులో 50 పడకలతో ప్రారంభమైన చిన్న ఆసుపత్రి ప్రస్తుతం పూర్తిస్థాయిలో సేవలందిస్తోందని మంత్రి తెలిపారు. అలాగే 18 జు×జ డిస్పెన్సరీలు రద్దవుతున్నాయన్న సమాచారం అందిన వెంటనే కేబినెట్‌లో చర్చించి, వాటి నిర్మాణానికి నిర్ణయం తీసుకున్నామని వెల్లడించారు.ఈఎస్ఐ ఆసుపత్రిలో అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించడం గొప్ప విషయమని, అవయవదాతలకు మంత్రి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఈఎస్ఐ ద్వారా కార్మికులకు మరింత విస్తృతంగా, సమర్థవంతంగా సేవలు అందేలా ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు.



## సీఎంకు కృతజ్ఞతలు తెలిపిన ఉద్యోగులు

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (వార్తా వేదిక సూర్య):

ఉద్యోగులకు ప్రమాద బీమా, ఆరోగ్య పథకాలను ప్రకటించడంపై ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి ఉద్యోగ సంఘాల నేతలు, ఉద్యోగులు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రిని ఆయన నివాసంలో టీజీవో, టీఎన్జీవో, రెవెన్యూ, ఉపాధ్యాయ, పెన్షనర్ల తదితర సంఘాల నాయకులు, ఉద్యోగులు కలిసారు. తమ చిరకాల వాంఛను నెరవేర్చారంటూ ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ రెండు పథకాలు చరిత్రలో నిలిచిపోతాయని ప్రశంసలు కురిపించారు. 652 గుర్తింపు పొందిన ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో 1,998 వ్యాధులకు నగదు రహిత చికిత్సలకు అవకాశాలు కల్పించడంపై హర్షం ప్రకటించారు. తెలంగాణ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి, తెలంగాణ ఉద్యోగుల జేఏసీ నాయకులు మారం జగదీశ్వర్, ఏలూరి శ్రీనివాసరావు, వి.లచ్చిరెడ్డి, కె.రామకృష్ణ తదితరులు ముఖ్యమంత్రిని కలిసారు.

## బపర్ జోన్ పేరుతో ఇండ్ల తొలగింపును ఆపాలి

### సీపీఐ (ఎమ్ఎల్) సీపీ రెడ్డి పార్టీ

### జాతీయ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ డిమాండ్

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (వార్తా వేదిక సూర్య):

మాసి సుందరీకరణలో భాగంగా బపర్ జోన్ పేరుతో పేదల ఇండ్లను కూల్చాడశీ తక్షణమే నిలిపి వేయాలని సీపీఐ ( ఎమ్ ఎల్) సీపీ రెడ్డి పార్టీ జాతీయ కార్యదర్శి మల్లేపల్లి ప్రభాకర్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం న్నీ డిమాండ్ చేశారు ఈ మేరకు ఒక ప్రకటనలో పేర్కొన్నారు ' మూసి నది మురికి కూపంగా మారిన నేపద్యంలో ప్రక్షాళన, నిజమైన నిజమైన పునర్జీవం జరగాలని హైదరాబాద్ ప్రజలు కోరుకుంటున్నారు,కానీ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను చూస్తుంటే ప్రక్షాళన కంటే సుందరీకరణ,రియల్ ఎస్టేట్,టూరిజం వ్యాపారికరనే కె ప్రాధాన్యత ఇస్తున్నట్లు స్పష్టం అవుతున్నది అని మూసి నదికి ఇరు వైపుల 50 మీటర్లు వరకు " బపర్ జోన్" పేరుతో దశద్బులుగా నివసిస్తున్న ప్రజల ఇండ్లను తొలగించేందుకు ప్రభుత్వం సిద్ధపడటం అన్యాయమైనది , ప్రభుత్వ అనుమతులతో నిర్మించుకున్న ఇండ్లను ఇపుడు అక్రమంగా ఎలా ప్రకటిస్తారు? బపర్ జోన్ లో ఉంటే గతంలో అనుమతులు ఎలా ఇచ్చారు? ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా ఏక పక్షంగా కూల్చివేతలు చేపట్టడం ప్రజాస్వామ్య విరుద్ధం అని పేర్కొన్నారు, మూసి నది వరదలతో ఏనాడు మునిగి పోనీ బస్తీలు,కాలనీలను ఈ ప్పుడు తొలగించాల్సిన అవసరం ఏమొచ్చింది? గరిష్ట నది ప్రవాహ మట్టం వివరాలను ఎందుకు ప్రజలకు వెల్లడించడం లేదు? అని నిలదీశారు" గాంధీ సరోవర్ ప్రాజెక్ట్ ' రీ వర్ ప్రోంట్ డెవలప్మెంట్" పేర్లతో పేద ప్రజల ను నిరస్రేయుల్ని చేసి, ఆ భూములను ,టూరిజం,ప్రవేట్ ప్రాజెక్టు లకు కట్ట బట్టే ప్రయత్నని విరమించుకోవాలని డిమాండ్ చేశారు, గుజరాత్ లోని సబర్మతి నది అభివృధి నమూనతో వేలాది పేదలను అక్కడ నుండి తరిమేసి నారు,అక్కడి పరిస్థితి హైదరాబాద్ ప్రజల కు రాబోతున్నది కావున రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని వెన్నకి తీసుకోవాలని డిమాండ్ చేశారు ,ఆ ప్రాజెక్ట్ డీ పి ఆర్ , ఎమ్ ఎఫ్ ఎల్ వివరాలను బహిర్గతం చెయ్యాలని కోరారు మూసి నది పరివాహక ప్రజల శాశ్వత పరిష్కారం తీసుకోవాలని డిమాండ్ చేశారు లేని పక్షం లో మూసి బాదితుల పక్షాన ఉద్యమాలు నిర్వహిస్తామన్నారు.

## ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తి



సిద్దిపేట, ఫిబ్రవరి 24 (వార్తా వేదిక సూర్య):

ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల నిర్వహణకు జిల్లాలో ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా కలెక్టర్ కె. హైమావతి తెలిపారు. నేటి నుండి ఏప్రిల్ 18వ వరకు నిర్వహించనున్న ఇంటర్మీడియట్ పరీక్షల ఏర్పాట్లపై మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత శాఖలో ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు మరియు జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారులతో సమీక్షించి తగు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ. జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లాలో మొదటి సంవత్సరం విద్యార్థులు 9946 మంది మరియు రెండో సంవత్సరం విద్యార్థులు 10089 మంది మొత్తం 20035 మంది పరీక్షలకు హాజరుకానుండగా 42 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లాలో ఎలాంటి ఆవంచనీయ సంఘటన జరగకుండా ఇంటర్మీడియట్ పరీక్షలను పగడ్బందీగా నిర్వహిస్తామని తెలియజేశారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సంబంధిత శాఖల జిల్లా అధికారులతో మాట్లాడుతూ. నేటి నుంచి వచ్చే నెల మార్చి 18వ వరకు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు నిర్వహించడం జరుగుతుందని, పరీక్షలు ఉదయం 9.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.00 గంటల వరకు నిర్వహిస్తారని వివరించారు. పరీక్షా కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలని, ఎలాంటి లోటుపాట్లకు తావులేకుండా పరీక్షలు సజావుగా కొనసాగేలా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని అన్నారు. ముఖ్యంగా పరీక్షలు సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా, నిరంతరం విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ అధికారులకు ఆదేశించారు, అలాగే పరీక్ష కేంద్రాల వద్ద ఉచిత వైద్య శిభిరాలను ఏర్పాటు చేసి, తగినన్ని మందులు నిల్వ పెట్టాలని వైద్య అధికారులకు సూచించారు, అవసరమైన పోలీసు బందోబస్త్ ఏర్పాటు చేయాలని పోలీస్ శాఖను, పరీక్షా కేంద్రాల వద్ద 163 బిఎన్ఎస్ సెక్షన్ ఏర్పాటు చేయాలని, అలాగే పరీక్షలు కేంద్రాల సమీపంలో జిరాక్స్ షాపులను మూసి ఉండే విధంగా చర్యలు తీసుకో వాలని అన్నారు, వేసవి దృష్టిలో పెట్టుకుని నాణ్యమైన త్రాగునీరు సమకూర్చి, కేంద్రాల పరసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు, పరీక్ష సమయానికి విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకునేలా ఆర్టీసీ బస్సులు నడపాలని, పరీక్ష కేంద్రంలోకి ఎలాంటి ఎలక్ట్రానిక్ వస్తువులు, మొబైల్ ఫోన్లను అనుమతించరాదని ఆదేశించారు. అలాగే విద్యార్దులు నిర్ధేశించిన సమయంలోపు పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు చేరుకోవాలని కలెక్టర్ సూచించారు. అలాగే పరీక్షల సమయంలో విద్యార్దులు మానసికంగా ఒత్తిడికి గురైతే, ఒత్తిడిని తట్టుకొని ప్రశాంతంగా పరీక్షలు వ్రాసేవిధంగా టేలి మానస్ నెం: 14416 కి ఫోన్ చేస్తే నిపునులు కౌన్సిలింగ్‌ల ఇస్తారన్నారు విద్యార్దులు సమస్యలను నివృత్తి చేసుకోనుటకు కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నెం: 9949330191 కి ఫోన్ చేయవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో శిక్షణ ఐపిఎస్ ఆయేషా ఫాతిమా, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారి రవీందర్ రెడ్డి, డీఈవో శ్రీనివాస్ రెడ్డి, డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ ధనరాజ్, డిపిఓ రవీందర్, ఆర్టీసీ, రవాణా తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


యాదాద్రి భువనగిరి వార్త వేదిక సూర్య హైదరాబాద్ బుధవారం, ఫిబ్రవరి 25, 2026
సంపుటి : 1 సంచిక : 270



# వాళ్లిద్దరి వయస్సు తేడా ఏడేళ్లు

టాలీవుడ్ ప్రేమజంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్నల పెళ్లిపై కొన్నేళ్లుగా సాగుతున్న సస్పెన్స్కు ఎట్టకేలకు శుభం కార్డు పడింది. వైవాహిక బంధంతో ఇద్దరం ఒకటి కాబోతున్నట్టు వీరు అధికారికంగా ప్రకటించారు. అభిమానులు తమపై చూపిస్తున్న ప్రేమకు గౌరవంగా, తమ పేర్లలోని మొదటి అక్షరాలను కలిపి 'విరోష్' అనే పేరుతో ఈ వివాహ వేడుకను జరుపుకోబోతున్నట్లు వెల్లడించారు. 'ది వెడ్డింగ్ ఆఫ్ విరోష్' పేరుతో సోషల్ మీడియాలో విడుదల చేసిన ఈ అధికారిక ప్రకటన ప్రస్తుతం రికార్డు వ్యూస్తో ట్రెండింగ్లో నిలిచింది. ఈ పెళ్లి వార్త బయటకు వచ్చినప్పటి నుంచి నెటిజన్లు వీరి వ్యక్తిగత విషయాలపై ఆసక్తికరమైన చర్చను మొదలుపెట్టారు. ముఖ్యంగా వీరిద్దరి మధ్య ఉన్న వయసు తేడా ఇప్పుడు హాట్ టాపిక్గా మారింది. విజయ్ దేవరకొండ 1989 మే 9న జన్మించగా (36 ఏళ్లు), రష్మిక 1996 ఏప్రిల్ 5న జన్మించారు (29 ఏళ్లు). వీరిద్దరి మధ్య దాదాపు ఏడేళ్ల వయసు వ్యత్యాసం ఉన్నప్పటికీ, వీరి కెమిస్ట్రీ, అన్యోన్యం ముందు ఆ తేడా ఏమాత్రం పెద్ద విషయం కాదని ఫ్యాన్స్ అంటున్నారు






# ఏప్రిల్ 3న పెద్ది

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, ఉప్పెన ఫేం బుచ్చిబాబు కాంబో పెద్ది నుంచి ఇప్పటికే చికిరి చికిరి సాంగ్ యూట్యూబ్లో సెన్సేషన్ క్రియేట్ చేసింది. ఈ మూవీ నుంచి రెండో సాంగ్ మార్చి 2 రిలీజ్ చేసేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. త్వరలోనే దీనిపై అఫీషియల్ అనౌన్స్మెంట్ రావాల్సి ఉంది. హీరో రోల్ ఇంట్రడ్యూస్ చేసే సాంగ్ విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. మరి దీనిపై క్లారిటీ రావాల్సి ఉంది. ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ అందిస్తుండగా... చికిరి చికిరి చార్ట్ బస్టర్గా నిలిచింది. రిలీజ్ చేసిన ఒక్క రోజులోనే 46 మిలియన్లకు పైగా వ్యూస్ సొంతం చేసుకుంది.100 మిలియన్లను పైగా వ్యూస్తో హిస్టరీ క్రియేట్ చేసింది. బ్యాట్ పట్టుకుని చికిరి చికిరి అంటూ చరణ్ వేసిన హుక్ స్టెప్పు దాదాపు లక్షల్లో సోషల్ మీడియాలో రీక్రియేట్ చేశారు. ఇప్పుడు అంతకు మించిన స్థాయిలో రెండో సాంగ్ ఉండబోతోందనే టాక్ వినిపిస్తోంది.మార్చి 27నే మూవీ ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉండగా... షూటింగ్ పెండింగ్, పోస్ట్ ప్రొడక్షన్ పనులు కంప్లీట్ కాకపోవడం వంటి కారణాలతో రిలీజ్ వాయిదా పడింది. వరల్డ్ వైడ్గా సమ్మర్ స్పెషల్గా ఏప్రిల్ 30న సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. అనుకున్న టైంకు మూవీ రిలీజ్ చేసేందుకు మూవీ టీం తీవ్రంగా శ్రమిస్తోంది.

# మలయాళంలోకి స్వీటీ ఎంట్రీ

**టాలీవుడ్ అందాల చందమామ అనుష్కశెట్టి.** ఒకానొక సమయంలో తెలుగు చిత్ర పరిశ్రమను తన అభినయంతో, గ్లామర్తో ఏకఛత్రాధిపత్యంగా ఏలింది ఈ మంగళూరు ముద్దుగుమ్మ. ప్రస్తుతం స్పీడ్ తగ్గించింది. ఘాటీ తర్వాత ఈ స్వీటీ మళ్లీ తెలుగు తెరపై బిజీ అవుతుందనుకుంటే ఆ సినిమా వైఫల్యంతో సైలెంట్ అయిపోయింది. తెలుగు, తమిళ భాషల్లో తిరుగులేని గుర్తింపు తెచ్చుకున్న అనుష్క, ఇప్పుడు మలయాళ చిత్ర పరిశ్రమ లోకి భారీ ఎంట్రీ ఇస్తోంది. కథనార్: ది వైల్డ్ సోర్సరర్ అనే ఫాంటసీ థ్రిల్లర్లో ఆమె కీలక పాత్ర పోషిస్తోంది. జయసూర్య ప్రధాన పాత్రలో నటిస్తుండగా, మోహన్ లాల్, ప్రభుదేవా వంటి హేమాహేమీలు ఈ చిత్రంలో భాగస్వాములయ్యారు. ఘాటీ మూవీ షూటింగ్ సమయంలోనే ఈ ప్రాజెక్టుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ సినిమాలో తన పాత్ర కోసం అనుష్క ప్రత్యేకంగా కత్తి యుద్ధం, ఇతర యుద్ధ విద్యల్లో శిక్షణ తీసుకున్నట్లు సమాచారం.. పాన్-ఇండియా స్థాయిలో విడుదల కానున్న ఈ చిత్రం అనుష్క కెరీర్కు మళ్ళీ పూర్వ వైభవం తెస్తుందని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి.



# 19ఏళ్లు చిన్నవాడితో మలైకా రొమాన్స్

**బాలీవుడ్ నటి మలైకా అరోరా గురించి ప్రత్యేక పరిచయం** అక్కర్లేదు. నటుడు అర్బాజ్ ఖాన్ నుంచి విడాకులు తీసుకున్న తర్వాత, ఆమె తన కంటే 12 సంవత్సరాలు చిన్నవాడైన అర్జున్ కపూర్ తో డేటింగ్ చేసింది. వారిద్దరూ దాదాపు 6 సంవత్సరాలు ప్రేమలో మునిగి తేలారు. ఇంత పెద్ద వయసు అంతరం ఉన్నప్పటికీ, అర్జున్-మలైకా కెమిస్ట్రీ, జోడీ చాలా మందికి నచ్చింది. అయితే ఏమైందో తెలియదు కానీ వీరిద్దరూ సడెన్ గా విడిపోయారు. ఇక అర్జున్ తో విడిపోయిన తర్వాత, మలైకా ఒక యువ వ్యాపారవేత్తతో ఎక్కువగా కనిపిస్తోంది. ముంబైలో జరిగిన ఒక సంగీత కార్యక్రమంలో వీరిద్దరూ జంటగా కనిపించారు. ఇక సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఈ ఫోటోలో, మలైకా హర్ష్ మెహతా అనే యువకుడితో సెల్ఫీ తీసుకుంటున్నట్లు కనిపిస్తోంది. ప్రేమికుల దినోత్సవం నాడు వీరిద్దరూ ఫారిన్ లో ఉన్నట్లు తెలుస్తోంది. మలైకా వయస్సు 52 సంవత్సరాలు. అలాగే హర్ష వయసు 33 సంవత్సరాలు . అంటే వీరిద్దరి మధ్య సుమారు 19 ఏళ్ల ఏజ్ గ్యాప్ ఉంది. హర్ష్ మెహతా ప్రముఖ వజ్రాల వ్యాపారి అలాగే హర్ష్ సంకాస్ మేనేజ్మెంట్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్. ఆయన వద్ద కోట్ల విలువైన ఆస్తులున్నాయి.

## 27నుంచి 'డాటర్ ఆఫ్ ప్రసాద్‌రావు'

రాజీవ్ కనకాల, ఉదయభాను, వసంతిక, శ్రీరామ్ వెంకట్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన వెబ్ సిరీస్ 'డాటర్ ఆఫ్ ప్రసాద్ రావు'. కృష్ణ పోలూరు దర్శకత్వంలో కె.వి. శ్రీరామ్ నిర్మించారు. ఫిబ్రవరి 27 నుంచి జీ5లో స్ట్రీమింగ్ కానుంది. ఉదయభాను మాట్లాడుతూ ఈ సిరీస్లో చేసిన క్యారెక్టర్ మాత్రం మైల్ స్టోన్లా నిలుస్తుంది. ఇందులోని నా మాడ్యులేషన్, పాత్ర తీరు, డైలాగ్స్ అన్నీ కొత్తగా ఉంటాయి. ఈ సిరీస్ ఏ ఒక్కరినీ నిరాశపర్చదు.. బోలెడన్ని ట్విస్టులు కూడా ఉంటాయి' అని చెప్పారు. 'ఈ కథకు, పాత్రకు ఓ తల్లిగా కనెక్ట్ అయ్యాను. పోలీస్ ఆఫీసర్ రోల్ చేయాలనే కోరిక ఈ సిరీస్ ద్వారా నెరవేరింది. ఇప్పుడున్న సమాజానికి ఎంతో అవసరమైన సిరీస్ ఇది' అని చెప్పారు. మంచి ఎమోషన్తో సాగే ఈ సిరీస్ ప్రతి కుటుంబాన్ని ఆకట్టుకుంటుందని దర్శకుడు కృష్ణ పోలూరు అన్నాడు.

Printed, Published and Owned by **POLOJU SRINIVASA CHARY**, and **Printed at SURYA DIGITAL PRINTERS**, H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252., and Published at H.No. 1-32, Markondeya Nagar, Choutuppal Municipality, Yadadri-Bhuvanagiri District, Telangana State-508252. **Editor: POLOJU SRINIVASA CHARY. PRGI.NO:- TGTEL/25/A0305**, Cell:9985389183. **EmailId:vaarthavedhikasurya2025@gmail.com**